వార్త

ఆదివారం

18 మే, 2025






# మీ పెళ్లి..
# బంగారం గాను!





# 'తమ్ముడు' జులైలో విడుదల



శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. దర్శకుడు శ్రీరామ్ వేణు పుట్టినరోజు సందర్భంగా 'తమ్ముడు' మూవీ రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేశారు. జూలై 4న ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

'తమ్ముడు' మూవీ రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ డిఫరెంట్‌గా ప్లాన్ చేశారు మేకర్స్. ఈ చిత్రంలో నటించిన వివిధ భాషలకు చెందిన యాక్టర్స్ స్వసిక విజయన్, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ, లయ, బేబి శ్రీరామ్ దీత్య ఒక్కొక్కరుగా డైరెక్టర్ శ్రీరామ్ వేణు దగ్గరకు వస్తారు. వీళ్లు తనకు బర్త్‌డే విషెస్ చెప్పేందుకు వచ్చారని శ్రీరామ్ వేణు అనుకోగా.. వాళ్లు మాత్రం 'తమ్ముడు' సినిమా రిలీజ్ ఎప్పుడు? ప్రమోషన్ ఎప్పుడు బిగిన్ చేస్తారు? అని అడుగుతారు. సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్న లయ తన పోస్టర్ కూడా రిలీజ్ చేయలేదు, రిలీజ్ డేట్ చెప్పడం లేదు.. అని అడుగుతుంది. ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ శ్రీరామ్ వేణు బర్త్ డే కేక్ కట్ చేయడంతో పాటు జులై 4న 'తమ్ముడు' మూవీ రిలీజ్ అంటూ ప్రకటిస్తారు. మంచి ఫన్‌తో డిజైన్ చేసిన ఈ వీడియో ఆకట్టుకుంటోంది.

శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థతో హీరో నితిన్, దర్శకుడు శ్రీరామ్ వేణుకు మంచి అనుబంధం ఉంది. హీరో నితిన్ దిల్, శ్రీనివాస కళ్యాణం వంటి మూవీస్ చేయగా– దర్శకుడు శ్రీరామ్ వేణు నాని హీరోగా 'ఎంసీఏ', పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా 'వకీల్ సాబ్' వంటి సూపర్ హిట్ చిత్రాలు రూపొందించారు. ఇప్పుడు ఈ ముగ్గురి కాంబినేషన్‌లో 'తమ్ముడు' సినిమా వస్తుండటం సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది.

'భీష్మ' తర్వాత నితిన్ సరైన సక్సెస్ చూడలేదు. మరి 'తమ్ముడు'తో నైనా కమ్ బ్యాక్ ఇస్తాడేమో చూడాలి!

తారాతీరం

# విజయ్ దేవరకొండ, గౌతమ్ తిన్ననూరి కాంబోలో 'కింగ్డమ్'

విజయ్ దేవరకొండ నటిస్తున్న తాజా చిత్రం 'కింగ్డమ్'. జాతీయ అవార్డు గ్రహీత దర్శకుడు గౌతమ్ తిన్ననూరి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ ఈ పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో విజయ్ సరసన యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు.

ఈ మూవీలో రౌడీ బాయ్ సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్, టైటిల్ టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ నెల 29న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి మరో వైల్డ్ పోస్టర్‌ను విడుదల చేశారు. కింగ్డమ్ మాస పరిపాలించడానికి సిద్ధంగా ఉంది అనే క్యాప్షన్‌తో కొత్త పోస్టర్‌ను మేకర్స్ పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఇక, ఈ చిత్రంపై రౌడీ బాయ్ ఫ్యాన్స్ చాలా ఆశలు పెట్టుకున్నారు. ఇటీవల కాలంలో ఆయన నటించిన సినిమాలు బాక్సాఫీస్ దగ్గర తీవ్రంగా నిరాశపరచడంతో ఈ సినిమాతో స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు.



ఆదివారం వార్త

18 మే, 2025

## మంచి ముత్యాలు

- ప్రయత్నాలు విఫలం కావచ్చు. ప్రయత్నించటంలో విఫలం కాకూడదు. యాతనలతో కూడుకున్నదే ప్రయత్నం.
- జీవితం కూడా ఓ ప్రయాణం లాంటిదే. అందులో కష్టాలు అనే స్పీడ్ బ్రేకర్స్ ఉంటాయి.

## కదంబం

'సంఘీ'భావం....5
దౌర్భాగ్య దుస్థితిలో పాకిస్థాన్

కవర్ స్టోరీ..6
మీ పెళ్లి..
బంగారం గాను!

సాహిత్యం.. 11
అలతి అలతి తెలుగు..

ఈ వారం కవిత్వం...12
నదిని బతికిద్దాం

కథ..20
నిస్వార్థం

పావనం పట్టాభిరాముని .. 26

అతి భారీ ఆకులు.... 28

ఇంకా...
మొగ్గ
వారఫలం
వంటలు
వగైరా.. వగైరా..

## సమాచారం

### ప్రత్యేకమైన పార్కు

పొద్దున్నే వ్యాయామం చేయడంకోసమో, సాయంత్రంపూట చల్లని గాలి పీల్చుకోవడానికో లేదా పిల్లలతో కలిసి తరచుగా పార్కులకు వెళ్లడం సర్వసాధారణమైన విషయం. కానీ ఈ పార్కుకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ పార్కుకి వెళితే మూడు దేశాలకు వెళ్లినట్లే! అది ఎలాగంటారా?

స్లోవేకియాలోని కునోవోలో ఉంది ప్రత్యేకమైన ఈ పార్కు. సాధారణంగా దేశ సరిహద్దులు కలిసే చోట చిహ్నాలు, పిల్లర్లు, జెండాలు ఏర్పాటు చేస్తుంటారు. కానీ స్లోవేకియా, హంగేరీ, ఆస్ట్రియా దేశాల సరిహద్దులు కలిసే చోట సోబోర్ పేరుతో 1991లో ఈ పార్కును నిర్మించారు. ఈ ట్రై పాయింట్‌లో మూడు బెంచీలు, ఓ టేబుల్‌ను త్రిభుజాకారంలో ఏర్పాటు చేశారు. ఇందులోని ఒక్కో బెంచీ ఒక్కో దేశానికి ప్రతీకగా చెప్తారు. స్లోవేకియా, హంగేరియా, ఆస్ట్రియా దేశాల బంధానికి, ఐకమత్యానికి ప్రతీకగా దీన్ని ఏర్పాటు చేసినట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. ఈ మూడు దేశాల ప్రజలు ఈ పార్కుకి వచ్చి కలిసి మెలిసి సంతోషంగా సమయం గడుపుతుంటారు. ఈ టేబుల్ పైనే అందరు కలిసి భోజనం చేస్తుంటారు. పార్కు నిర్వాహకులు ఇందులో కళాఖండాలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుని కళాకారులను ఆహ్వానించారు. అయితే వాళ్లు తయారు చేసే కళాఖండాలన్నీ త్రిభుజాకారంలోనే వుండాలన్న నిబంధన పెట్టారు. స్లోవేకియా రాజధాని బ్రాటిస్లావాకు సుమారు ఇరవై కి.మీ. దూరంలో ఉందీ పార్క్. ఆస్ట్రియాలోని వియన్నా నుంచి ఒక గంట ప్రయాణం; హంగేరీలోని బుడాపెస్ట్ నుంచి రెండు గంటల ప్రయాణం చేస్తే సోబోరో పార్కు చేరుకోవచ్చు.



మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com










# పూలు లేని పుష్పగుచ్ఛాలు



పెళ్లి, పదోన్నతి లాంటి శుభ సందర్భాల్లో ఫ్లవర్ బొకే ఇస్తాం! కానీ అవి కొద్దిసేపటికే వాడిపోతాయి. కానీ ఇక్కడ పండ్లతో, కాయలతో చేసిన బొకేలివి. నోరూరిస్తున్నాయి కదా!











'సంఘీ' భావం



# దౌర్భాగ్య దుస్థితిలో పాకిస్థాన్

పాకిస్థాన్ అన్ని రంగాల్లో వైఫల్యం చెందింది. కనీసం ప్రజలకు సరైన పాలన కూడా ఇవ్వలేకపోతోంది. ఆర్థిక పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయి. డాలరుతో పోలిస్తే పాకిస్థాన్ రూపాయి విలువ ఏకంగా 281 రూపాయలుగా ఉంది. భారతదేశం, పాకిస్థాన్‌లు ఒకరోజు వ్యత్యాసంలో స్వాతంత్ర్యాన్ని పొందాయి. సుమారు ఎనిమిది దశాబ్దాలు కావస్తుండగా భారత్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడమే కాకుండా ప్రపంచంలో ఆర్థిక పురోగతి సాధిస్తున్న దేశాలతో ముందంజలో ఉంది. మన దేశంలో జీడీపీ పాకిస్థాన్ కన్నా పది రెట్లు అధికంగా ఉంది. రుణాలు వస్తేనేగానీ పాకిస్థాన్‌కు పూట గడవని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం భారత్‌తో కయ్యానికి కాలుదువ్వి మరింత సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. 1947 ఆగస్టు 15న భారతదేశం స్వాతంత్ర్యాన్ని ప్రకటించగా ఒకరోజు ముందుగా పాకిస్థాన్ కూడా స్వతంత్ర దేశంగా ప్రకటించింది, అప్పటి నుంచి అక్కడ ప్రజాస్వామ్యం దాదాపుగా అమలుకాలేదు. సుమారు 43 సంవత్సరాలు మిలట్రీ పాలనలో ఉక్కు పాదాల కింద సామాన్యులు నలిగిపోయారు. ఇప్పటకీ అక్కడ మిలట్రీ ఆధిపత్యం కొనసాగుతూ ఉంటుంది. ప్రభుత్వ పాలన ఏమాత్రం తమకు అనుకూలంగా లేదని భావిస్తే వెంటనే అక్కడి ఆర్మీ ప్రభుత్వాన్ని తన చేతుల్లోకి తీసుకుంటుంది. అంతే కాకుండా ఎదురు తిరిగితే అప్పటి ప్రధాని జుల్ఫీకర్ ఆలీ భుట్టోను ఉరితీసింది. దీనితో మిలట్రీ మాటను జవదాటడానికి అక్కడి ప్రభుత్వాలు వెనుకంజ వేస్తాయి. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ దిశగా భారత్ ప్రయాణం చేస్తూ జీడీపీ దాదాపు 3.88 ట్రిలియన్లుగా ఉంటే పాక్ జీడీపీ కేవలం 0.37 ట్రిలియన్లతో తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతోంది. అక్కడి దేశంలో ఉగ్రవాద విధానాలే ఆర్థిక దుస్థితికి కారణమని విశ్లేషణలు పేర్కొంటున్నాయి. స్వాతంత్ర్యం సిద్ధించినప్పటి నుండి భిన్నమైన మార్గాల్లో పయనిస్తున్న పొరుగు దేశాలు భారత్, పాకిస్థాన్ మధ్య ఆర్థిక వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తోంది. ఒకవైపు భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంటే, మరోవైపు పాకిస్థాన్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి, పతనం అంచున నిలిచింది. ఈ తరుణంలో, ఇరు దేశాల ఆర్థిక స్థితిగతులపై అంతర్జాతీయ సంస్థల నివేదికలు ఆసక్తికర విషయాలను వెల్లడిస్తున్నాయి. 2023లో పాకిస్థాన్ దివాలా తీసే అంచుకు చేరగా, 3 బిలియన్ల ఐఎంఎఫ్ రుణం తిరిగి ఊపిరి పీల్చుకుంది. స్వాతంత్రం వచ్చిన తొలినాళ్లలో అమెరికా సహాయం, చమురు సంపన్న ఇస్లామిక్ దేశాల విరాళాలతో పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ కూడా భారత్‌తో సమానంగానే వృద్ధి చెందింది. అయితే, ప్రజాస్వామ్యబద్ధంగా పయనించిన భారత్, ఆర్థికాభివృద్ధిపై, ప్రజలను పేదరికం నుంచి గట్టెక్కించడంపై దృష్టి సారించింది. దీనికి విరుద్ధంగా, పాకిస్థాన్ రక్తసిక్తమైన సైనిక తిరుగుబాట్లు, నియంతృత్వ పాలనలతో సతమతమైంది. ఇప్పటికీ అక్కడ సైనిక జనరల్స్ ప్రభావం అధికంగా ఉండటంతో పాటు, పొరుగున ఉన్న భారత్ శత్రుత్వాన్ని రెచ్చగొట్టడం, ఉగ్రవాదానికి శిక్షణ, నిధులు సమకూర్చడం వంటి చర్యలు ఆ దేశ ఆర్థిక పతనానికి ప్రధాన కారణాలుగా మారాయి. ఈ ఉగ్రవాద విధానాలు తిరగబడి, బలూచిస్థాన్, నార్త్ వెస్ట్ ఫ్రాంటియర్ ప్రావిన్స్‌లలో హింసాత్మక ఘటనలకు దారితీస్తున్నాయి. ఇటీవల పహల్గామ్‌లో 26 మంది పర్యాటకుల మృతికి కారణమైన దారుణ ఉగ్రదాడి నేపథ్యంలో, పాకిస్థాన్‌తో ఉద్రిక్తతలు పెరిగినప్పటికీ, భారత ఆర్థిక వ్యవస్థ స్థూల ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉంటాయని గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలు స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ పెట్టుబడులు బలంగా ఉండటం, ప్రైవేటు వినియోగం మెరుగ్గా ఉండటం దీనికి కారణాలని తెలిపింది. రక్షణ వ్యయం పెరిగే అవకాశం ఉన్నా, అది భారత ఆర్థిక స్థిరత్వంపై పెద్దగా ప్రభావం చూపబోదని అంచనా వేసింది. ఆర్థిక పరిస్థితులు ఇంతదారుణంగా ఉంటే మరోపక్క అంతర్గత వివాదాలు పాకిస్థాన్‌లో పెచ్చుపెరిగాయి. ముఖ్యంగా తమ పెంచి పోషించిన ఉగ్రవాద సంస్థలు ప్రస్తుతం పక్కలో బల్లెంగా నిలిచాయి. ఒకపక్క మిలట్రీ, మరోపక్క ఉగ్రమూకలతో పాకిస్థాన్ ప్రభుత్వం సతమత మవుతోంది. బలూచిస్థాన్ వేర్పాటువాదులు సుమారు ఏడు దశాబ్దాలుగా పోరాటం సాగిస్తున్నాయి. తహరిక్ తాలిబన్ పాకిస్థాన్ సంస్థ సమాంతర ప్రభుత్వాన్ని కొనసాగిస్తోంది. బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ, బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్, మజీద్ బ్రిగేడ్‌లు పాకిస్థాన్ ప్రభుత్వానికి కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. ఉగ్రవాదం మూలాలతో ఆవిర్భవించిన తాలిబన్‌లు ప్రస్తుతం ఆఫ్ఘనిస్థాన్‌లో పాలన సాగిస్తూ హింసాకాండకు కొంత దూరంగా ఉంటున్నాయి. పాకిస్థాన్ పెంచి పోషించిన తాలిబన్‌లు ప్రస్తుతం పాకిస్థాన్ వైఖరికి పూర్తి వ్యతిరేకతతో ఉన్నాయి. ఉగ్రవాదంపై పోరు చేస్తున్న భారత్‌కు తాలిబన్‌లు అండగా నిలబడానికి సిద్ధపడ్డాయంటే భారత్ గొప్పతనంగా చెప్పుకోవచ్చు. పొరుగున్న భారత్ అభివృద్ధిని అనుసరించి ముందుకు సాగాల్సిన పాకిస్థాన్ అందుకు భిన్నంగా కుట్రలు పన్నుతూ, ఉగ్రవాదాన్ని పోషిస్తూ అత్యంత దయనీయ, దౌర్భాగ్య పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

నీలం సంపత్

# మీ పెళ్లి.. బంగారం గాను!




**మా నవ జీవన మనుగడకు ఊపిరులూదుతున్న స్త్రీ, పురుష సంబంధాలను నైతికంగా, న్యాయాత్మకంగా సుస్థిరం చేస్తూ పెనవేసే ఓ అద్భుతమైన శాశ్వత సాంప్రదాయ సహజీవన వ్యవస్థ యే వివాహ వ్యవస్థ. ఐతే ప్రపంచంలోనే అత్యంత దృఢమైన వివాహ వ్యవస్థగా పేరు గాంచిన భారతీయ వివాహ వ్యవస్థలో మంగళ సూత్రంతో పాటు పుస్తెలతాడు ప్రధాన పాత్రను ధరిస్తుండడం గమనార్హం. హిందూ సాంప్రదాయం ప్రకారం తాళిబొట్టు బంగారంతోనే చేయించాలని శాస్త్రాలు తెలియజేస్తున్నాయి.**

వాటికి తోడుగా నల్లపూసల గొలుసులో అనివార్యంగా కనపడే గుండ్లు సైతం బంగారంతోనే చేయించడం ఆనవాయితీగా కొనసాగుతున్న వైనం బహిరంగ రహస్యమే. వధువుకు ముక్కుపుడక, చెవిరింగులు వివాహ మహోత్సవంలో భాగంగా వధువు చేతికి ధరింపజేసే ప్రదానపు ఉంగరం కూడా బంగారంతోనే చేయించడం పరిపాటి.

వివాహ వేడుక కన్నా ముందు జరిగే ఎంగేజ్ మెంట్‌లో భాగంగా కాబోయే వధూవరులు ఇద్దరూ పరస్పరం ఒకరికొకరు బంగారంతో చేసిన ఉంగరాలను ధరింప జేసుకోవడం సైతం బలమైన వివాహ సాంప్రదాయంలో భాగంగా కొనసాగుతూ వస్తుండడం తెలిసిందే.

వీటికి అదనంగా వధూవరుల కుటుంబాల ఆర్థిక పరిస్థితుల వెసులుబాటుని బట్టి వధువుకు బంగారంతో చేయించే కర్ణాభరణాలు, కంఠాభరణాలు, ముంజేతికి బంగారు గాజులు, వరుడికి చేతి వేలుకు ఓ రింగ్‌తో పాటు మెడకో బంగారు గొలుసు, వీలైతే చేతికో బంగారు బ్రేస్‌లెట్ చేయించి గౌరవించడం ఓ ఆనవాయితీగా కొనసాగుతున్న వైనం గమనార్హం. ధనిక, పేద భేదం లేకుండా పెళ్ళి తంతుకు సంబంధించిన సాంప్రదాయాలని గౌరవించాల్సిందే!?

భారతదేశ వివాహ వేడుకలో కోట్ల రూపాయల సంపద కలిగిన కోటీశ్వరులతో పాటు మధ్య తరగతి, దిగువ మధ్య తరగతులకు చెందిన వారి వరకూ ప్రతి వివాహంలో ఎంగేజ్ మెంట్ నుండి వివాహం వరకు; ఎంగేజ్ మెంట్ రింగ్ నుండి తాళిబొట్టు వరకు బంగారు ఆభరణాలను అనివార్యంగా చేయించాల్సిందే. ఈ నేపథ్యంలో మన దేశ వివాహ వ్యవస్థలో బంగారం ఓ నిర్ణయాత్మక పాత్రని పోషిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

దీనికితోడు సౌందర్య పిపాసులైన భారతీయ స్త్రీలు పండగలకూ, పబ్బాలకే కాకుండా కుటుంబ పరంగా జరుపుకునే అన్ని ఉత్సవాలలో పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలను ధరించి సమాజంలో తమ దాబునూ, దర్పాన్నీ, హోదాను ప్రదర్శించుకోవాలనే కోరిక కూడా భారతీయ సమాజంలో బంగారం డిమాండ్‌ని విపరీతంగా పెంచుతుందనే సత్యాన్ని జీర్ణించుకోకతప్పదు.

## సాంప్రదాయేతర వివాహాల్లోనూ తాళి తప్పని సరే!

కృత్రిమ మేధస్సు స్ఫూర్తితో నాగరికత ఉరకలు వేస్తున్న వేళ, ప్రాచ్య, పాశ్చాత్య నాగరికతల జడివానలో తడిసి ముద్దవుతున్న భారతీయ సమాజంలో ఆర్య సమాజంలో వివాహాలూ, ఆదర్శ వివాహాలు, ప్రేమ వివాహాలూ, రిజిస్టర్డ్ వివాహాల ఉధృతి పెరుగుతున్నా భార్యాభర్తల బంధానికి సాంప్రదాయపు శాశ్వత చిరునామాగా మారిన మంగళ సూత్రాలకు ప్రత్యామ్నాయం కనుక్కోబడడం లేదు. కొన్ని సందర్భాల్లో సహజీవనంలోనూ తాళిబొట్టు భార్య మెడలో అనివార్యంగా కనపడుతూ ఆ భార్యాభర్తల మధ్య సహజీవన సంబంధాన్ని సుస్థిరం చేస్తున్న వైనం బహిరంగ రహస్యమే.


## బులియన్ మార్కెట్‌లో బంగారం ధర నిర్ణయం ఎలా జరుగుతుంది?

దేశంలో బంగారం ధరను ఇతర వస్తువులకు సంబంధించిన విధంగా ఆ వస్తువులను ఉత్పత్తి చేసిన ఉత్పత్తిదారుడే నిర్ణయించడు. బంగారం ధరను బులియన్ మార్కెట్లో ఏ ఒక్క వ్యక్తి లేదా వ్యవస్థ నిర్ణయించలేదు, నియంత్రించలేదు. సంపూర్ణ పోటీ మార్కెట్లో ఆ బంగారం ఉత్పత్తితో పాటు సప్లయ్, దానికి వుండే డిమాండ్‌లే నిర్ణయిస్తాయనేది సార్వజనీన సత్యమే.

ద్రవ్య విలువ తగ్గి, ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడినప్పుడు బంగారాన్ని సుస్థిర పెట్టుబడిగా భావిస్తూ ప్రజలు బంగారాన్ని కొనుగోలుచేయడం జరుగుతుంది. మరోవైపు రాజకీయ, ఆర్థిక అనిశ్చితి ఏర్పడినప్పుడు సైతం ఆ సంక్షోభ సమయంలోనూ ప్రజలు బంగారాన్ని నమ్మదగిన పెట్టుబడిగా భావించడం జరుగుతుంది. ఫలితంగా బంగారానికి డిమాండ్ పెరిగి దాని ధరలు ఆకాశాన్నంటుతాయి. వీటికి అదనంగా గత కొన్ని సంవత్సరాల నుండి చిన్న చిన్న పొదుపు మొత్తాలను సైతం బంగారంగా మార్చడానికి ప్రముఖ ఆభరణాల తయారీ దారులు నెలసరి వాయిదాలతో స్కీముల ద్వార ప్రజలకు బంగారాన్ని సమకూర్చడంతో పాటు వివిధ బ్యాంకులు సైతం గోల్డ్ లోన్ సదుపాయాల ను కల్పించడం మూలాన కూడ బంగారానికి డిమాండ్ పెరుగుతుండడం గమనార్హం.

మరోవైపు బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచినప్పుడు పెరిగిన వడ్డీ ఆశతో పొదుపు చేసే అవకాశాలున్న ప్రతి వ్యక్తి తమ దగ్గర వుండే నగదును బ్యాంకులో డిపాజిట్ చేసే ప్రయత్నం చేస్తాడు. దాని పర్యవసానంగా బంగారం డిమాండ్ తగ్గి పోతుంది. వీటిక్కితోడు కరెన్సీ విలువలో వచ్చే హెచ్చు తగ్గులు, ఇతర ఆస్తుల విలువలలో వచ్చే మార్పులతో పాటు మార్కెట్ వృద్ధి, క్షీణత ఊహాగానాలు సైతం బంగారం ధరల్లో మార్పులకు కారణంగా అభివర్ణించక తప్పదు.





### స్వతంత్ర భారతంలో పరుగు పెడుతున్న పసిడి ధరలు?

1947లో మన దేశానికి స్వాతంత్ర్య మచ్చినప్పుడు పది గ్రాములకు 88 రూపాయల 62 పైసలుగా వున్న బంగారం ధర కాలానుగుణంగా పెరుగుతూ, తగ్గుతూ మళ్ళీ స్వల్ప మార్పులకు లోనౌతూ వచ్చిన బంగారం ధర 1979 వరకు వేయి రూపాయలకు దాటకపోవడం గమనార్హం. 1980లో 1330గా వున్న పది గ్రాముల బంగారం ధర 2006 వరకూ పదివేలకు చేరుకోలేదు. 2007లో 10,800గా వున్న బంగారం ధర 2014లో 28,734కు పెరిగింది. చివరికి గత పదేళ్ల కాలంలో పది గ్రాముల బంగారం ధర అనూహ్యంగా పెరుగుతూ నేటికది ఒక లక్ష రూపాయలకు చేరువైన ఫలితంగా దేశంలో మధ్య తరగతి, దిగువ మధ్య ప్రజల కుటుంబాలలో పెళ్లిళ్ల నిర్వహణకు ప్రధాన అవరోధంగా మారుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది.



### పెండ్లంటే నూరేండ్ల పంటే. కాదు.. బంగారం కోసం.. .తంటగా మారుతోంది !?

సమాజంలో ప్రజలు వారి వారి సామాజిక, ఆర్థిక హోదాలకు అనుగుణమైన రీతిలో పెళ్ళి వేడుకను ఘనంగా జరపడానికి త్రికరణ శుద్ధిగా ప్రయత్నం చేస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. అప్పులు చేసైనా సరే అవసరమైతే వున్న కాసిన్ని ఆస్తులను తెగనమ్ముకొనైనా సరే ఖర్చులో ఎక్కడా రాజీ పడకుండా వివాహ మహోత్సవాన్ని దిగ్విజయంగా పూర్తి చేయడానికే సంసిద్ధులౌతారనే సత్యం బహిరంగ రహస్యమే. అదేదో తమ వంశ పరువు ప్రతిష్టలకు సంబంధించిన అంశమన్నట్లు తమకున్న పరిమితులను అధిగమించి అన్ని హంగులూ, ఆర్భాటాలతో వివాహ వేడుకను జరపడం ఓ ఆనవాయితీగా కొనసాగుతున్న వైనం లోక విదితమే. మానవాళి భవిష్యత్తు కోసం అనివార్యమైన స్త్రీ, పురుషుల సంగమానికి నైతిక, న్యాయాత్మక సహజీవనానికి దారులు వేస్తూ ఓ ఆదర్శ సమాజ సృష్టికి ఊపిరులూదుతున్న సాంప్రదాయ వివాహ వేడుక భారీ బడ్జెట్ సినిమాని మరిపిస్తున్న వైనం సదరు ఖర్చులను భరించలేని మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి, పేద వర్గాల ప్రజల పట్ల ఓ శాపంగా పరిణమిస్తోంది.

పెళ్ళి వేడుక కోసం అంబానీలు, ఆదానీలు వేల కోట్ల రూపాయలను ఖర్చు చేయడానికి వెనుకాడాల్సిన అవసరం లేకపోవచ్చు. కాని సామాన్య ప్రజల పరిస్థితులు వేరు. ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్నమై, సంఘ జీవనానికి అందనంత దూరంలో, పట్టణీకరణ ఉక్కు కౌగిలిలో చిక్కి ఒంటరి జీవితాన్ని గడుపుతున్న ప్రజలు వైవాహిక సంబంధాలు వెదికి పెట్టడానికి గతంలోలాగా బంధుమిత్రులో/పెళ్లిళ్ల పేరయ్యలో అందుబాటులో లేని నేపథ్యంలో షాదీ డాట్ కామ్‌లూ, మ్యారేజ్ బ్యూరోల పైన ఆధారపడక తప్పడం లేదు. ఐతే వారి సర్వీసులు ఉచితమనుకుంటే పొరపాటే. వాటి సేవలను పొందడానికి వేల రూపాయల రిజిస్ట్రేషన్ ఫీజులతో సహా వరకట్నంలోనూ పర్సెంటేజీ ఇవ్వాల్సి రావడం బాధాకరం.

కాస్ట్లీ వెడ్డింగ్ కార్డులూ, ప్రి వెడ్డింగ్ ఫోటో షూట్‌లూ, హల్దీ, సంగీత్‌లతో అట్టహాసంగా జరిపే ప్రి వెడ్డింగ్ వేడుకలూ, అంగరంగ వైభవంగా తీర్చిదిద్దే పెళ్ళి మండపాలు, డ్రోన్ కెమెరాలతో డిజిటల్ ఫోటోగ్రఫీ, ఆర్కెస్ట్రాలూ, మ్యూజికల్ కన్సర్ట్‌లూ, లేజర్ షోలతో జిగేల్‌మనే వెలుగులతో దేనికీ తగ్గేదేలే అనే స్థాయిలో విందు భోజనాలతో పెళ్ళి బడ్జెట్ బాహుబలి సినిమా బడ్జెట్‌ని మరిపిస్తోంది. ఆ తర్వాత పోస్ట్ వెడ్డింగ్ ఫోటో షూట్‌లూ, హనీమూన్ టూర్‌లతో పెళ్ళి తంతుకు తాత్కాలికంగా శుభం కార్డ్ పడుతుంది.



పై ఖర్చులన్నీ ఒక ఎత్తైతే వీలైతే ఎంతో కొంత బేరమాడే వెసులుబాటుకు అవకాశముంది. కానీ పెళ్లికి అవసరమైన బంగారం కొనుగోలులో ఎలాంటి బేరసారాలకు తావు లేకపోవడం ముఖ్యమైన సమస్యగా మారుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది.

## పెళ్ళి బాధ్యతను ప్రభుత్వం చేపట్టినా ఫలితం లేకుండా పోతుండడం బాధాకరమే!?

2014వ సంవత్సరంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగిన తర్వాత ఏర్పడిన తొలి ప్రభుత్వం నిరుపేద కుటుంబాలలో ఆడ పిల్లల వివాహానికి పెళ్ళి కానుకగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పేరుతో ఒక లక్షా ఒక వేయి రూపాయలను బహుమతిగా అందించే పథకాన్ని ప్రవేశపెట్టిన వైనం బహిరంగ రహస్యమే. ఎంత నిరుపేద కుటుంబాలలోనైనా ఒక లక్ష రూపాయల పెట్టుబడితో పెళ్ళి అసాధ్యమే అయినా, గుడ్డిలో మెల్లగా ఆ మొత్తం కొంత మంది నిరుపేద ప్రజలకు తమ కుటుంబాలలోని బాలికల వివాహానికి చేదోడు వాదోడుగా ఉపయోగపడిన మాట నిజం.

ఈ నేపథ్యంలో గత పదహారు నెలల క్రితం రాష్ట్రంలో నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఆ మొత్తంతో పాటు ఓ తులం బంగారాన్ని కూడా అదనంగా కానుకగా అందిస్తామని చేసిన వాగ్దానం ప్రజల్లో కొత్త ఆశలను రేకెత్తించిందనడంలో ఎలాంటి సందేహానికి తావులేదు. ఐతే ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పులతో రాష్ట్ర పాలనను చేపట్టిన మా ప్రభుత్వానికి ఎంత ఇవ్వాలని వున్నా ఇప్పుడిప్పుడే తులం బంగారం కానుకగా ఇచ్చే వెసులు బాటు లేదని తేల్చిచెప్పడం గమనార్హం.

## అసలేం చేయాల్సి వుంది??

రాకెట్ వేగంతో దూసుకుపోతున్న బంగారం ధరల నేపథ్యంలో సమాజంలోని మధ్య తరగతి, నిరుపేద వర్గాల ప్రజలు, మరీ ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే పేద వారిగా గుర్తించబడి ఒక రూపాయికి కిలో చొప్పున నెలకు మనిషికి ఒక్కొంటికి ఆరు కిలోల బియ్యాన్ని రేషన్‌గా పొందుతున్న ప్రజలు వారి రోజువారీ లేదా నెలసరి సంపాదన ఎంత తక్కువగా వున్నా అందులో నుండి ఎంతో కొంత పొదుపు చేసి ఓ గ్రామో, అర గ్రామో బంగారాన్ని కొనుగోలు చేసే అలవాటు చేసుకోవాల్సిందే. ఏ కుటుంబంలోనైనా ఆడపిల్ల జన్మించిన ఏడాది నుండే బంగారం కొనుగోలు కార్యక్రమాన్ని ప్రారంభిస్తే తప్ప సాంప్రదాయ వివాహ వేడుకకు గుండెకాయ లాంటి బంగారపు తాళిబొట్టుని సమకూర్చుకునే అవకాశం లేదనే కఠోర సత్యాన్ని జీర్ణించుకోక తప్పదు. ఐతే అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో హెచ్చు తగ్గుల కుదుపులకు లోనయ్యే బులియన్ మార్కెట్‌లో భాగంగా బంగారం ధర కూడా హెచ్చు, తగ్గులను ఎదుర్కొనే అవకాశాలు ఉండడం సహజమే.

ఐతే భారతదేశంలో గత వంద సంవత్సరాలలో పది గ్రాముల బంగారం ధర 1925లో 18 రూపాయల 75 పైసలుగా వుండగా నేటికి అదే పది గ్రాముల బంగారం ధర 1 లక్ష రూపాయలకు చేరువవుతున్న క్రమంలో సదరు బంగారం ధరలో కాలానుగుణంగా స్వల్ప హెచ్చు తగ్గులు ఏర్పడినా అంతిమంగా పెరగడమే నిజమని నిర్ధారించబడుతోంది. ఐతే ధరలో హెచ్చు తగ్గుల గురించి బంగారంతో వ్యాపారం చేసేవారు ఆలోచించుకోనిద్దాం.

సాంప్రదాయ వివాహ వేడుకకు తలమానికంగా కొనసాగుతున్న ఎంగేజ్‌మెంట్ రింగులూ, మంగళ సూత్రాలు, ప్రధానపు ఉంగరాలతో సహా సాంప్రదాయపు ముక్కుపుడకలకో, చెవి పోగులకో అవసరమైన బంగారాన్ని కొనుగోలు చేయడానికి అవసరమైన పొదుపు చేసి బంగారాన్ని కొనుగోలు చేసినప్పుడే పరుగులు పెట్టే పసిడి ధరలతో సంబంధం లేకుండా ప్రపంచ వివాహ వ్యవస్థకు వెన్నెముకగా కొనసాగుతున్న మన భారతీయ వివాహ వేడుక ఎలాంటి ప్రతికూలతలను ఎదుర్కోకుండా కన్నుల పండుగగా దిగ్విజయంగా పూర్తవుతుందనడంలో ఎలాంటి సందేహాలకు తావు లేదు.

భారతీయ సాంప్రదాయ వారసత్వ సంపదలో భాగంగా వేద కాలం నుండి వర్తమానం వరకూ అవిశ్రాంతంగా కొనసాగుతున్న మూడు ముళ్లూ, ఏడడుగులూ, ఏడేడు జన్మలకు మూలంగా కొనసాగుతున్న బంగారంతో చేసిన తాళిబొట్టు ప్రాధాన్యతను ఎన్ని తరాలు మారినా మరిచిపోయే ప్రసక్తి లేదు.



ఎందుకంటే–

మాంగల్యం తంతునానేనా మమ జీవన హేతునా ।
కంఠే భద్నామి సుభగే సంజీవ శరదశ్శతం ॥

పెండ్లి కొడుకునైన నేను పెళ్ళి కూతురువైన నీ మెడలో ఈ మంగళ సూత్రాన్ని నీ కంఠానికి కడుతున్నాను. దీనిని ధరించిన నీవు నా జీవితంలో అన్నింటా సగభాగమై నాకు తోడు, నీడగా వుండడం ద్వారా మనమిద్దరం నిండు నూరేండ్ల పాటు కలిసి ఆనందంగా జీవిద్దాం.. అంటూ కాబోయే వరుడి మాటగా వివాహ వేడుకలో భాగంగా వేద పండితుల నోట్లో నుండి వెలువడే పవిత్ర మంత్రాల పరమార్థమనేది నేటి భారతీయ సమాజపు ఉద్దేశంగా భావించక తప్పదు.

ఐతే వివాహ వేడుకలో భాగంగా కాబోయే వధువు మెడలో చేరబోయే మంగళసూత్రం ఒంటరిగా కాకుండ ముత్యం, పగడం తోడుని కోరుకుంటాయి.



వివాహ మహోత్సవానికి సంబంధించిన ఈ సాంప్రదాయం పూర్వీకుల నుండి మన తరానికి వారసత్వంగా రావడానికి శాస్త్రీయమైన కారణాలున్నాయని తలపండిన పూజారుల ఉవాచ.

పత్తితో తయారైన దారంతో అల్లబడిన పుస్తెల తాడులో తాళిబొట్టుకు తోడుగా వుండే ముత్యం, పగడం సూర్య కిరణాల నుండే ఎరుపు (కుజుడు), తెలుపు (చంద్రుడు)లను స్వీకరించి స్త్రీ శరీర భాగంలోని అన్ని నాడీ కేంద్రాలను ఉత్తేజపరిచి శారీరకంగా, మానసికంగా నూతన జంటకు గ్రహాల వలన, ఆరోగ్య పరంగా స్త్రీలలో వచ్చే దోషాలను, నష్టాలను తొలగిస్తూ శుభప్రదమైన వైవాహిక జీవితాన్ని కానుకగా అందిస్తాయని ఘోషిస్తున్నారు.

## వివాహాలు స్వర్గంలోనే నిర్ణయించబడతాయి..

అక్కడ నిర్ణయించబడిన వివాహాలను భూమిపై నివసిస్తున్న మనం మన బాధ్యతగా పూర్తి చేయాల్సిందేననే లోకోక్తి లో నిజానిజాల మాట ఎలా వున్నా.. ఇలలో ఆ వివాహాలు విజయవంతంగా పూర్తయి నూతన వధూవరులకు నిండు నూరేండ్ల ఆనందకరమైన వైవాహిక జీవితాన్ని కానుకగా అందించాలంటే కేవలం పుస్తెల తాడుతో కూడిన బంగారు తాళిబొట్టు కాబోయే వధువు కంఠాభరణంగా మారితే సరిపోదు. భవిష్యత్ వైవాహిక జీవనం పట్ల నూతన వధూవరుల మధ్య ఓ విస్పష్టమైన అవగాహన ఏర్పడడంతో పాటు రెండు కుటుంబాల వారసులతో మూడో కుటుంబ సృష్టికి ఊపిరులూదాల్సిన స్థాయిలో నూతన వధూవరుల తల్లిదండ్రులూ, కుటుంబ సభ్యులూ సైతం ఎంతో సంయమనంతో వ్యవహరిస్తూ పరస్పరం ప్రేమానురాగాలను పంచుకోవాలి.



ఓ ఫ్యామిలీ కౌన్సెలర్ అన్నట్లు– నూతన వధూవరులు పాలూ, నీళ్లలా కలిసినంత మాత్రాన వారి దాంపత్య జీవనం శుభప్రదంగా సాగదు. వారి నూతన సంసారంలో ఏర్పడే సరిగమలను వారి కుటుంబ సభ్యులు ఒక కుటుంబంగా వ్యవహరిస్తూ సరిగా పలికించగలిగితేనే అది సాధ్యమౌతుంది.

ప్రాచ్య, పాశ్చాత్య నాగరికతల దుష్ప్రభావంతో ఏ వైవాహిక బంధం తోడ్పాటు లేకుండానే సహజీవనం చేయడం ద్వారా మానవ జాతి మనుగడకు పూనుకోవచ్చనే ఓ విశృంఖల సంస్కృతి వైపు భారతీయ సమాజం మొగ్గు చూపుతున్న వేళ.. అది గాజు బొమ్మ లాంటిదేననే సత్యాన్ని విస్మరించకుండా, ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైనదీ, విశ్వసనీయమైనదీ అయిన మన వివాహ వ్యవస్థను విదేశీ సంస్కృతుల బారి నుండి కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదీనని అంగీకరించక తప్పదు.

ఈ నేపథ్యంలో కృత్రిమ మేధస్సు తోడ్పాటుతో మనిషి సృష్టికి ప్రతి సృష్టి చేయడానికి సిద్ధపడుతున్న క్రమంలో మనుషుల్లో మానవీయ విలువలను పెంపొందిస్తూ సుదృఢమైన వైవాహిక బంధంతో ఓ ఆదర్శ కుటుంబ సృష్టికీ, తద్వార ఓ అద్భుతమైన ఆదర్శ సమాజ నిర్మాణానికీ నడుం కట్టే మార్గాన్ని సుగమం చేసే అద్వితీయమైన శక్తి కలిగిన మన సాంప్రదాయ వివాహ వ్యవస్థను త్రికరణ శుద్ధిగా కాపాడుకోవడానికి ఎన్ని సవాళ్ళు ఎదురైనా వాటన్నింటినీ ధీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగాల్సిందే.



# ట్రెక్కింగ్‌లో జాగ్రత్తలు



ఈ కాలం యువత ట్రెక్కింగ్‌ను ఎక్కువగా ఇష్టపడుతోంది. అమ్మాయిలు, అబ్బాయిలు అని తేడా లేకుండా వీకెండ్స్‌లో, సెలవుల్లో బృందంగా ఏర్పడి ట్రెక్కింగ్ వెళ్తున్నారు. అయితే ఈ సాహసోపేత క్రీడలో పాల్గొనడం అంత సులభం కాదు, అందరివల్ల కూడా కాదు. కొండలు, పర్వతాలు అధిరోహించాలంటే ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలి. లేదంటే మార్గమధ్యంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ట్రెక్కింగ్‌కు వెళ్లేవారు కొన్ని ముందు జాగ్రత్తలు పాటిస్తే సునాయాసంగా కొండలు, గుట్టలు మొదలైనవి ఎక్కవచ్చు.

* ట్రెక్కింగ్ చేయాలంటే శారీరకంగా దృఢంగా ఉండాలి. రోజూ వ్యాయామం చేస్తే పర్వాలేదు. వ్యాయామం చేయనివారు ట్రెక్కింగ్‌కు కొన్ని రోజుల ముందు నుంచి అయినా వ్యాయామం చేయడం మొదలుపెడితే శరీరంలో సత్తువ, ఓర్పు పెరుగుతుంది. అదేవిధంగా ఇంట్లో, ఆఫీసులో మెట్లు ఎక్కడం, దిగడం ప్రాక్టీస్ చేయాలి. దీని వల్ల ట్రెక్‌ను సులభంగా చేయవచ్చు.

* ట్రెక్కింగ్‌కు శారీరకంగానే కాకుండా మానసికంగానూ సంసిద్ధంగా ఉండాలి. ఎక్కగలనో లేదో, ఏదైనా ప్రమాదం జరుగుతుందా? లాంటి భయాలు పెట్టుకోవద్దు. నేను చేయగలను.. అనే సానుకూల దృక్పథంతో ముందడుగు వేయాలి. వీలైతే ట్రెక్కింగ్ ఎలా చేయాలో ముందే తెలుసుకుంటే మరీ మంచిది. మిత్రులు తోడు ఉంటారన్న భావన కూడా కొండత ధైర్యాన్ని ఇస్తుంది.

* ట్రెక్కింగ్‌కు వెళ్లే ప్రాంతానికి అనుగుణంగా దుస్తులు ధరించాలి. వాతావరణం చల్లగా ఉంటే శరీరానికి వెచ్చదనం ఇచ్చే ఉన్నిదుస్తులు ధరించడం మంచిది. వేడిగా ఉంటే ప్రాంతమైతే పల్చటి, కాటన్ దుస్తులు వేసుకోవడం అత్యుత్తమం. బిగుతుగా ఉన్నవి వేసుకోకూడదు. పాదాలు సురక్షితంగా, సౌకర్యవంతంగా ఉండేలా పాదరక్షలు ధరించాలి.

* ట్రెక్కింగ్‌లో శరీరం హైడ్రేట్‌గా ఉండాలి. అందుకే తరచూ నీరు తాగాలి. వెంట ఆహారం తీసుకెళ్లడం మర్చిపోవద్దు. కొండలు, గుట్టలు ఎక్కాలంటే శక్తి కావాలి కదా! ఇందుకోసం కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు అధికంగా ఉంటే ఆహారం తీసుకోవాలి. తక్కువ మొత్తంలో ఎక్కువ సార్లు తినడం మంచిది.



* సమయం, ఫిట్‌నెస్‌ను బట్టి ట్రెక్కింగ్ ప్రాంతాన్ని ఎంచుకోవాలి. వెళ్లే ప్రాంతానికి సంబంధించిన పూర్తి వివరాలు ముందుగానే తెలుసుకోవాలి. సరైన మార్గంలోనే వెళ్తున్నామా లేదా తెలుసుకోవడం కోసం మ్యాప్స్, దిక్సూచి, నావిగేషన్ సాధనాలను వెంట తీసుకెళ్లాలి. తెలియని ప్రాంతమైతే గైడ్‌ను నియమించుకోవడం మంచిది.

* దారిలో అనుకోని ప్రమాదాలు సంభవించొచ్చు. ఆక్సిజన్ స్థాయిలు తగ్గినప్పుడు అనారోగ్యానికి గురికావొచ్చు. అందుకే ముందుగానే వైద్యుల్ని సంప్రదించి అవసరమైన ఔషధాలు తీసుకోవాలి. బ్యాండేజీలు, నొప్పి నివారణ, యాంటిసెప్టిక్ ఔషధాలతో కూడా ప్రాథమిక చికిత్స సామగ్రిని దగ్గర పెట్టుకోవాలి. వాటిని ఎలా వాడాలో ముందుగానే తెలుసుకోవాలి.

* సరైన నిద్ర లేకుంటే ఏ పని చేయలేం. ట్రెక్కింగ్‌కు వెళ్లేముందు సరిపడా నిద్ర పోవాలి. దారిలో అలిసిపోతే కాసేపు విశ్రాంతి తీసుకొని ఆ తర్వాత మళ్లీ ప్రారంభించాలి. వేగంగా వెళ్లొద్దు. అలాగని నెమ్మదిగా వెళ్లొద్దు. మధ్యస్థ వేగంతో నడవాలి. అప్పుడే శరీరం తొందరగా అలిసిపోకుండా ఉంటుంది.

* ట్రెక్కింగ్ అంటే పగటిపూట ఎండలో చేయాల్సి వస్తుంటుంది. ఈ క్రమంలో చర్మం పాడయ్యే అవకాశముంది. అందుకే, యూవీ కిరణాల వల్ల చర్మం దెబ్బతినకుండా సన్‌స్క్రీన్ లోషన్స్ రాసుకోవాలి. శరీరం మొత్తం కవర్ అయ్యేలా దుస్తులు ధరించాలి. కళ్లకి చలువకళ్లద్దాలు పెట్టుకుంటే మరచిపోవద్దు.

## కార్టూన్లకు ఆహ్వానం

**కార్టూనిస్టుల నుండి ఆరోగ్య కరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**sunmagvaartha@gmail.com**

# అలతి అలతి తెలుగు పద మాధుర్యం-తిక్కన

జయసూర్య

ఆంధ్ర మహాభారతం రెండున్నర పర్వాలు రచించి, నన్నయభట్టు దివంగతులయిన తర్వాత రెండు వందల యేళ్లు దాని జోలికి పోయిన కవి లేదు. ఆంధ్ర మహాభారతం పూర్తి కావాలని నాటి ఆంధ్ర దేశం ఆశిస్తున్నా ఫలితం లేదు. కాకతీయుల పాలనా కాలంలో ఆంధ్రజాతి ఆంధ్రభాష అనే చైతన్యం కలిగింది. పంచమ వేదమైన మహా భారతాన్ని 'ఆంధ్రావళి మోదం బొరయునట్లు' రచిస్తానని తిక్కన గంటం చేతపట్టడం, ఆంధ్రజాతి చరిత్రలో అపూర్వ ఘట్టం.

ఆంధ్ర జాతిని ఏకచ్ఛత్రాధిపత్యంగా కాకతీయ సమ్రాట్‌లు ఆంధ్ర దేశాధీశ్వరులుగా ఓరుగల్లు మహానగరిని పాలిస్తున్న సువర్ణ సందర్భం అది. కాకతీయ చక్రవర్తులకు ఆంధ్రజాతి అనే జాతీయ భావం పట్ల అభిమానం స్థిరపడుతున్నా, పరిస్థితుల ప్రభావం కారణంగా రాజభాషగా సంస్కృతం ఆదరణ పొందుతోంది. సంస్కృత శాసనాలు, సంస్కృత కావ్య నాటకాలు, రాజనీతి గ్రంథాలు, వ్యాఖ్యానాలు ఆ యుగంలో సంస్కృత కవి పండితులు ఆదరింపబడుతున్నారు. క్రమేపీ జానుతెనుగు పేరుతో దేశీయ పదజాలంతో తెలుగు ప్రవేశించింది. కాకతి రుద్రమదేవి తండ్రి గణపతిదేవుని కాలంలో కదన రంగంలో ఖడ్గ తిక్కనగా నెల్లూరి రెండవ మనుమసిద్ధిని గణపతి దేవ చక్రవర్తి సహాయంతో నెల్లూరు రాజ్యసింహాసనంపై ప్రతిష్ఠింపచేసిన మహాదండనాథుడు. మనుమసిద్ధికి మంత్రిగా, ఆస్థాన కవిగా ఉభయ కవిమిత్ర బిరుదు పొందిన తిక్కనామాత్యుడు 1250-63 కాలంలో ప్రౌఢ వయస్కునిగా 13వ శతాబ్దంలో జీవించిన చారిత్రక ఆధారాలున్నాయి. కాకతీయ గణపతి దేవుని కొలువుకూటానికి దూతగా వచ్చిన తిక్కనామాత్యుడు ఓరుగల్లు కాకతీయ రాజసభలో ఘన స్వాగతం పొందటం, కాసె సర్వప్ప ప్రణీతంబైన సిద్ధేశ్వర చరిత్రలో అద్భుత అధ్యాయంగా వర్ణించబడింది. కాకతీయుల కాలంలో, ఏకశిలా నగరంలోనే తదనంతరం తిక్కన ఆంధ్ర మహాభారత రచన కొనసాగించినట్లు చరిత్ర చెప్తోంది. తిక్కన, మహాభారత రచన వ్యాస భారతానికి అనువాదమైనప్పటికీ కేవలం ఆంధ్రీకరణగా కవిపండితులు భావించరు.

కళాత్మక సౌందర్యంతో మూల సంస్కృత ఇతిహాసాన్ని మించిన రచనగా, స్వతంత్ర కావ్యంగా మహోన్నతంగా విలసిల్లింది. దీర్ఘసమాస భూయిష్టమైన శైలి విడిచిపెట్టి అలతి అలతి తెలుగు మాటల వాడుకతో తిక్కన సందర్భానికి తగిన దేశీయ పదజాలంతో తెలుగు భాషకు ప్రాణప్రతిష్ఠ చేసారు.

'జాత్యముగామి నొప్పయిన సంస్కృతమెయ్యెడ జొన్ప'నని తిక్కన తెలుగు భాషా శైలికి జీవం అందించారు. కాకతీయ చక్రవర్తుల కాలంలో తెలంగాణా సీమలో కాదు యావదాంధ్ర సామ్రాజ్యంలో రాజకీయ అస్థిరత, అరాచక స్థితిగతులు కొంత అంతరించి ప్రశాంత వాతావరణం ఏర్పడింది. నన్నయ, తిక్కనలకు మధ్య కాలం తెలంగాణా సీమలో తెలుగు సాహిత్య సృజన కారణంగా తెలుగులో రామాయణాలు, పురాణాలు వెలుగు చూసాయి. వీరశైవం విజృంభించిన కాలంలో శివకవులు వస్తువు ఛందస్సుల నవ్యత సృష్టించి దేశీయతకు ప్రాధాన్యత యిచ్చారు. తిక్కన నిర్వచనోత్తర రామాయణం, మహాభారత రచనల కన్నా పూర్వమే రామాయణ, మహాభాగవతాలు తెలంగాణాలో రచింపబడ్డాయి. తిక్కన హరిహరాద్వైతాన్ని బోధిస్తే, తర్వాత సోమన వీరశైవాన్ని వేద ప్రామాణికంగా ఉన్నత స్థానాన్ని అధివసింపచేసారు. తిక్కన జీవిత కాలం పరిశీలిస్తే తొలుత శివాభిమానిగా కన్పించినా, తర్వాత మహాభారత రచనా కాలంనాటికి శైవ, వైష్ణవాలకు అభేదం చెప్పి, అద్వైత బోధనా పరంగా ధార్మిక సమైక్య ప్రశాంతతకు మత, రాజకీయ, సాహిత్య రంగాలలో ధర్మ సంస్థాపన చేసినట్లు చరిత్ర స్పష్టం చేస్తోంది.

హరిహరనాథుడు సాక్షాత్కరించి తెనుగు భారతాన్ని తనకు అంకితం యివ్వమని కోరటం చిత్రమైన యోగనిద్రా సిద్ధి సంబంధితమైన సంఘటనగా 'తిక్కన కవితా వైభవం'లో డా॥ పాటిబండ మాధవ శర్మ వ్యాఖ్యానించారు. తిక్కన కవితాత్మను, అనితర సాధ్యమైన సాహిత్య తత్త్వం, మహాభారతంలోని పాత్రల నిశిత మనస్తత్వ దర్శన పరిశీలన, శబ్దం నుండి రూపం సృష్టించి ధ్వనింపచేయటం, అనిర్వచనీయ నాటకీయత, అలతి తెలుగు పలుకులతో మహార్థాలను, భాసింపచేసే మహా మాంత్రికత, అత్యాధునిక తెలుగు కవితా రచనల అద్భుత కల్పనా వైచిత్రికి మార్గదర్శకమైంది. వ్యాస మహాకవి కూడా ఊహించని సృష్టికి ప్రతి సృష్టి చేసిన కవిబ్రహ్మ కుమ్మరి చేతిలో మట్టి శిల్పాకృతి పొందిన పోకడగా రస స్ఫూర్తివంతంగా అక్షర శిల్పాన్ని ఆవిష్కరింపచేసారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎందరో ఆనాటి మహాకవులు, ఆధునిక సాహితీ ప్రపంచం నేటికీ సజీవంగా సహస్రాబ్దాలుగా ఆ కారణజన్ముని జీవింపచేస్తోంది.




"తిక్కన సమకాలానికి ఎదురు తిరిగి వారు ససేమిరా ఒప్పుకోని నీతిని బోధించాడు. తిక్కన రాసినదంతా వాడుక భాషే అని లోకం ఎప్పుడు గుర్తిస్తుందో కదా! గిడుగు పండితుడు ఈ విషయాన్ని మొట్టమొదటిసారిగా గుర్తించాడు. తెలుగు వాడుకపు తీరు తియ్యందనాన్ని తిక్కనలోనే చూడాలి. మనం మాట్లాడుకొనే భాషలో ఎన్నెన్ని రకాల రమణీయకాలున్నాయో అవన్నీ తిక్కనలో గోచరిస్తాయి. తిక్కన భారతంలోని పాత్రలంతా తెలుగు వ్యక్తులు, వాళ్ల కష్టాలనే మహాభారతం చేసాడు. "తెలుగులో తిక్కన, వేమన, గుజాడ" మహాకవులు అన్నారు. 1954 రేడియో ప్రసంగంలో మహా ప్రస్థాన మహాకవి శ్రీశ్రీ.

# చీమ



సైనిక కవాతును
తలపిస్తోంది
చీమల బారు..
క్రమశిక్షణ
వాటిని చూసి నేర్చుకోవాలి మరి!
తనకంటే ఎన్నో రెట్లు బరువును
ఎత్తేందుకు తెగ ప్రయత్నిస్తోంది చీమ
ఒలింపిక్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు
తర్ఫీదవుతున్నట్లే వుంది !
నిర్మించుకుంటాయి
చీమలు నేల మాళిగల్లో అంతస్తులు!
అనంత పద్మనాభుని నేలమాళిగల్ల
సంపదకు చీమలు పోగేసుకున్న సంపద
ఏ మాత్రం తీసిపోదు
“కాకుంటే కానుకలు విరాళాలు కావు!”
శ్రమైక జీవన సౌందర్యానికి
సమానమైనది లేనే లేదని
చీమల్ని చూసి
రాసేడేమో శ్రీశ్రీ గీతం!
“బలవంతమైన సర్పం చలిచీమల చేత
జిక్కి చావదె సుమతీ!”
శతక రికార్డుల్లో కెక్కింది
ఇంకెన్ని అవార్డులు అందుకోనుందో!

**- ఉమ్మడిశెట్టి నాగేశ్వరరావు**

# నదిని బతికిద్దాం!



నది అంపశయ్య ఎక్కింది!
కాలుష్య కురుక్షేత్రంలో ఆక్రమణల
శిఖండ అడ్డుపడి భీష్ముడిలా
నేలకొరిగి ఎండిపోయింది!
జీవనది జీవానికే ముప్పు వచ్చింది
శరీరం నిండా గాయాలు
నిర్లక్ష్యం శరాలు నాటుకుపోయి
స్వార్థం శూలాలు దూసుకుపోయి
కబ్జాల కరవాలాలు
తూట్లు పొడిచి
ఇసుక మాఫియా ఇనుప
బల్లేలతో
దాడి చేసి
ధన పిశాచి శల్య సారథ్యంలో ఓడించి
నది కొన ఊపిరితో కొట్టుకుంటోంది..
జలంపై అందరిలో అవగాహన పుడితేనే
నది బతుకుంది
నిర్లక్ష్యం స్వార్థం కబ్జాల్లాంటివి
పారదోలితేనే నది వికసిస్తుంది.
నదిని నదిలా స్వేచ్ఛగా వదిలేస్తేనే
గలగలా ప్రవహిస్తుంది..
సకల సంపదలు అందిస్తుంది
అవసరాలు తీర్చి ఆపదలో
ఆదుకుంటుంది
నదిని గౌరవిస్తేనే
మన గౌరవం నిలుస్తుంది.

**- భీమవరపు పురుషోత్తమ్**

# పంచ పదులు

వాణ్ణెప్పుడు చూసినా
ముఖమూ వర్ఛస్సూ
శాస్త్రీయ సంగీతంలా
వుంటాడతను
.......
పగలంతా చేతులెత్తి భరతనాట్యం చేసిన
కడలి రాత్రి కాగానే
కదలక మెదలక పడుకొంది
......
దాహంతో ఆల్లాడే
పూ మొగ్గ అనుకొంది
వొక చుక్క నీరు దొరికితే
పుష్పమై వికసింతునని
గాఢమైన ప్రేమకు
వేళేమిటి స్థలమేమిటి
పొంగివచ్చే దుఃఖానికి
అదుపేమిటి గడువేమిటి
..........
నేనెంత దుఃఖంలో వున్నా
కన్నీరు తుడవడానికి జేబులో
చేతి గుడ్డ వుందనే ధైర్యం నాకు

**- భూషి కృష్ణ దాసు**

## ఈ వారం కవిత్వం

# నా గుండె లోలకమై..



ఎడారి లాంటి నా జీవితపు అడవిలో
ఎక్స్ కిరణాల్లా ఎదురుగా వచ్చి
చిరునవ్వుల వెన్నెల కురిపించావు.
నా ఎదలో ఏదో అలజడి మాటున
నా గుండె లోలకమై
నీ పేరుతో డోలనాలు చేస్తుంది..
ఇది ఫిక్షనా ఫ్రిక్షనా తెలియదు కానీ
ఫిజిక్స్ లోని ఉష్ణం
నా కనురెప్పల అంచున
కాంతిలా మారి..
నా బ్రెయిన్ తలపులలో
ఆనందపు స్పెక్ట్రమ్ ఏర్పడింది..!
నేను యంపిసి.. నువ్వు బైపిసి
మనద్దరి మధ్య కెమిస్ట్రీ
ఓ సిఇసి అంటూ ఏదో
కొత్త కొత్తగా పోయెట్రీ రాస్తుంటే
అక్షరాలు ఏవో... అంకెలు ఏవో..
అర్థంకాక నీ కోసమై కదిలిన
నా అడుగుల గమనమే..
నా జ్ఞాపకాల గానమై..
నేను నమ్మిన గణితమయ్యింది.

**- ఫిజిక్స్ అరుణ్ కుమార్**

# ఇష్టం అంచుదాకా నడుస్తూ

నాకు నేను
అర్థమైనంతలో నిజాయితీగా మెలిగి
నమ్మకాన్ని అప్పు చెప్పి
నిజాలతో లోతును పూడ్చి
మనసు నిలబెట్టుకున్నాను...
....
కానీ
కాలం మెల్కొలిపిన అర్థాలకు
నిజాల్ని మోసే బాధగా
బాధలో నడిచే నిజానిగా
పలుచనవుతున్నా...
ఇష్టం అంచు దాకా నడుస్తూ
మనసు ఆగేదు కాదు
నిజం వెనుకాడేది లేదు.

**- చందలూరి నారాయణరావు**

ఆనంద 'మైత్రేయ'మ్

# పోషకాల గని 'అరటి'

అరటిని ప్రపంచ ఫస్ట్ ఫ్రూట్‌గా కొందరు శాస్త్రవేత్తలు చెబుతారు. ప్రపంచ వ్యాప్తంగా 107 దేశాల్లో అరటి సాగు జరుగుతుంది. ధన విలువలో ఆహార పంటల్లో అరటి నాలుగో స్థానంలో ఉంది. అరటి పండు శుభసూచకం. మన భారతీయ సంస్కృతిలో ఏ శుభకార్యం జరిగినా అందులో అరిటాకు, అరటిపళ్లు, అరటిచెట్టుకు సంబంధించిన కాండాలు ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. అరటి ప్రాముఖ్యత గురించి రామాయణంలో వివరించబడితే.. ఇదీ అరటి ఆవిర్భావం గురించి భాగవతంలో వివరించబడింది. అరటిని 'కదళీ', 'రంజ' అనే పేర్లతో కూడా చాలామంది పిలుచుకుంటారు. అరటి పండు, అరటి ఆకు శుభకార్యాలకు ఎంతో శ్రేయస్కరమని పెద్దలు చెబుతారు. ముఖ్యంగా పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల వేళ భోజనాలకు, మంటపాల అలంకరణకు వినియోగిస్తారు. దేవుళ్లకు సంబంధించిన పూజా కార్యక్రమాలలో స్త్రీలు వ్రతాలు, నోములు నోచుకున్నప్పుడు తమ ఇష్టదేవతలకు పూజలు నిర్వహించుకునేటప్పుడు ఈ అరటి ఆకులను, పళ్లను ఉపయోగిస్తారు. ముత్తైదువులకు భోజనం పెట్టేటప్పుడు అరటి ఆకులను, తాంబూలంలో అరటిపళ్లను ఇస్తారు. అదే విధంగా కొత్తగా ఇంట్లో ప్రవేశిస్తున్నప్పుడు ఇంటి గుమ్మాలకు వీటిని తగిలిస్తారు. అలాగే పెళ్లి వంటి కార్యక్రమాలలో కూడా ఈ అరటి తనదైన ప్రాధాన్యతను కలిగి వుంటుంది.

అరటిపళ్ళు ప్రకృతి వర ప్రసాదం. అత్యధికంగా భూమిపై ప్రజలు తినే పళ్ళలో అరటి పళ్లదే మొదటి స్థానమని చెప్పవచ్చు. అరటిపండులో నీటి శాతం కంటే ఘనపదార్థం ఎక్కువగా ఉంటుంది. ఇవన్నీ శరీరాన్ని పోషించే పదార్థం కావడం వల్ల దీన్ని పండుగానే కాకుండా ఆహారంగాను తీసుకోవచ్చు. అరటిపళ్లలో పొటాషియం అత్యధికంగా ఉంటుంది. పొటాషియం శరీరంలోని రక్త ప్రసరణను, నీటి సమతుల్యతను అదుపులో ఉంచుతుంది. అరటిపళ్లలోని పొటాషియం అధిక రక్తపోటును, గుండె సంబంధ వ్యాధులను దూరం చేస్తుంది. దీనిలో అధిక మోతాదుల్లో ట్రిప్టోఫాన్ ఉంటుంది. మన శరీరం ట్రిప్టోఫాను సెరటోనిన్‌గా మార్చుకొని జ్ఞాపక శక్తిని పెంచి మానసిక ఆందోళన లేకుండా చేస్తుంది. అరటిపళ్లలో ఉండే విటమిన్ 'బి6' మానసిక ప్రశాంతతను ఇచ్చి మంచి నిద్ర పట్టేలా చేస్తుంది. అరటిపళ్లలో కాల్షియం ఎక్కువగా లేకపోయినప్పటికీ కాల్షియంను ఎక్కువగా కోపించుకొనేలా చేసి ఎముకలను దృఢపరుస్తుంది ఉంటుంది.



జీర్ణక్రియ సక్రమంగా జరగడానికి ఇది చాలా ఉపయోగపడుతుంది. అరటిలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. తరచూ అరటిపండ్లను తినే వారిలో మూత్రపిండ వ్యాధులు వచ్చే ప్రమాదం 50 శాతం తక్కువ. కండరాల నొప్పులను సులువుగా తగ్గిస్తుంది.

ఈ పండులో లెక్కలేనన్ని ఆరోగ్య, సౌందర్య ప్రయోజనాలు ఉన్నాయి. చర్మానికి, శిరోజాలకు మేలు చేస్తుంది. ఈ పండులో ఉండే సి, బి6 చర్మం మృదువుగా ఉండేలా సహకరిస్తుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ వార్థక్య భయాలు



రానివ్వకుండా చర్మాన్ని కాపాడతాయి. కొన్ని పండ్లు కొన్ని సీజన్స్‌లలో మాత్రమే దొరుకుతాయి. కొన్ని పండ్లు సంవత్సరానికి ఒక్కసారే దొరుకుతాయి. చాలా తక్కువ పండ్లు మాత్రమే ప్రతిరోజూ దొరుకుతాయి. అలా మనకు ఎక్కువగా అందుబాటులో ఉండేది అరటి పండు.

అరటిపండు సూకోజ్, ఫ్రక్టోజ్, గ్లూకోస్ వంటి సహాయ చక్కెరలతో పాటూ, ఫైబర్‌లను కూడా కలిగి ఉంటుంది. అరటిపండు తక్షణ శక్తిని అందించటమే కాకుండా, శక్తి స్థాయిలను గణనీయంగా పెంచుతుంది. ఒక అరటిపండు నుండి వచ్చే శక్తి ద్వారా నిరంతరంగా 90 నిమిషాల పాటు కఠినమైన వ్యాయామాలను చేయవచ్చని పరిశోధనలలో వెల్లడించారు. స్మోకింగ్ మానేయాలంటే అరటిపండు తీసుకోమంటున్నారు నిపుణులు. అరటిపండులో ఉండే బి విటమిన్లు ఇతర ఖనిజాలు నికోటిన్ మానేయగల ప్రభావాన్ని శారీరకంగా, మానసికంగా కూడా కల్పిస్తాయి. అరటిపండులో ఐరన్ అధికం. అరటిపండే కాదు పచ్చి అరటి కూడా చాలా మంచిది. బరువు తగ్గాలనుకునే వారికి పచ్చి అరటి సరైన ఆహారం. మెటబాలిజం బూస్టర్లగా పని చేస్తాయి. కొవ్వును కరిగించగల శారీరక సామర్థ్యాన్ని పెంచుతాయి. పచ్చి అరటిలోని కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో సహకరించటం ద్వారా బరువు తగ్గడానికి దోహదపడతాయి.

హ్యాంగోవర్ సమస్య నుండి త్వరగా ఉపశమనం పొందాలంటే తేనె కలిపిన బనానా మిల్క్ షేక్ తీసుకోవడం మంచిది. అరటిపండు జీర్ణాశయాన్ని శాంతపరుస్తుంది. రోజుకో అరటిపండును తీసుకోవడం ద్వారా లివర్‌ను శుభ్రం చేసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. అరటి పండులో వుండే కెరోటినాయిడ్స్ లివర్నే కాకుండా కంటి చూపును కూడా మెరుగుపరుస్తుంది. అరటిలో కేన్సర్ కారకాలపై పోరాడే శక్తి అధికంగా వుంది. రోజు ఓ అరటిపండును ఆహారంలో చేర్చుకోవడం ద్వారా కంటికి సంబంధించిన వ్యాధులు రాకుండా వుంటాయి. దృష్టి లోపాలు దూరమవుతాయి. అరటి పండులోని ఫైబర్ బరువు తగ్గిస్తుంది. హృద్రోగాలను దూరం చేస్తుంది. అరటిలోని పొటాషియం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. రక్తపోటు చాలా వరకు అదుపులో ఉంచుతుంది. కేన్సర్ కారకాలైన ఫ్రీ రాడికల్స్ వృద్ధి చెందకుండా అరటిపళ్ల కాపాడతాయి. సాధారణ సైజులో ఉండే అరటిపండులో దాదాపు 420 మి.గ్రా పొటాషియం ఉంటుంది. రోజుకొక అరటిపండు తినేవారిలో ఆస్తమా వచ్చే అవకాశాలు 34 శాతం తక్కువ. ప్రతిరోజు భోజనంలో ఒక అరటిపండు తినడం వల్ల మంచి కంటిచూపును పొందవచ్చు. అరటిపళ్ల తియ్యగా ఉండి తిన్న వెంటనే కడుపు నిండినట్లు అనిపిస్తుంది. అందుచేత బరువు తగ్గవచ్చు.

సొరియాసిస్ వంటి చర్మ వ్యాధులకు అరటిపండు తొక్క దివ్య ఔషధం. ప్రతి అరటిపండులో 105 కేలరీల శక్తి ఉంటుంది. ప్రొటీన్లు అతి తక్కువ ఉంటాయి. కొవ్వులు అసలు ఉండవు. అరటిపండులో గ్లయిసిమిక్ ఇండెక్స్ 60 వరకూ ఉంటుంది. అంటే తిన్న వెంటనే రక్తంలో షుగర్ లెవెల్స్ పెరగవు.



కామెర్లలోనూ, ఇతర కాలేయపు వ్యాధులలోనూ నిరభ్యంతరంగా వాడుకోవచ్చు. అరటిలో పొటాషియం మోతాదు చాలా ఎక్కువ కాబట్టి దీన్ని కిడ్నీ ఫెయిల్యూర్లో వాడకూడదు. శరీరంలోని విషపదార్థాలను తొలగిస్తుంది. పచ్చి అరటికాయలు విరోచనాలను, పండువి మలబద్ధకాన్ని, అల్సర్లను అరికడతాయి. డయేరియాను తగ్గించడంలో అరటి ఎంతో ఉపయోగపడుతుంది. అనారోగ్యంగా ఉన్నవారు అరటిపండును తింటే ఆరోగ్యంగా ఉంటారనే విషయం వేరే చెప్పనక్కర్లేదు.

ఉదయం బ్రేక్ ఫాస్ట్ తర్వాత, మధ్యాహ్నం భోజనం తర్వాత ఇది వారి శరీరంలోని పొటాషియం శాతాన్ని తగ్గించటమే కాకుండా మెదడు, రక్త సంబంధిత రోగాలను 21 శాతం వరకు నయం చేస్తుంది. అరటిపండు తింటే బరువు పెరుగుతారని ఒక అపోహ ఉంది కాని అది నిజం కాదు.

అరటిపండు మన శరీరానికి ఎన్నో రకాల ప్రయోజనాల్ని ఇస్తుంది. ఇందులో న్యూట్రియన్స్, విటమిన్స్, ఫైబర్, సక్రోజ్, ఫ్రక్టోజ్లు సమృద్ధిగా ఉంటాయి. ఇన్ని పోషకాలున్న అరటిపండును రోజు తింటే డాక్టర్‌తో అవసరమే ఉండదు. రోజూ ఒక యాపిల్ తింటే డాక్టర్‌తో పని ఉండదని అంటారు కానీ రోజుకు రెండు అరటిపండ్లు తిన్నా డాక్టర్‌తో పని ఉండదని నిపుణులు చెప్తున్నారు. అరటిపండు ఇన్‌స్టంట్ ఎనర్జీని ఇస్తుంది. ఇందులో ఫైబర్, సక్రోజ్, ఫ్రక్టోజ్, గ్లూకోజ్ అనే మూడు రకాల షుగర్లు ఉంటాయి. అరటిలో విటమిన్స్, మినరల్స్, మెగ్నిషియం, డైటరీ ఫైటర్స్ అధికంగా ఉంటాయి. ఇది డిప్రెషన్ను తగ్గించి నాడీ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. అధిక కొలెస్ట్రాల్‌ని తగ్గించి హిమోగ్లోబిన్ లెవల్ పెంచుతుంది. ఆటంకం లేని నిద్ర రావాలంటే మిలాటోనియం అనే హార్మోన్ అవసరం. అరటిపండులో డిప్లోనిన్ అనే ఎమినో యాసిడ్ ఉండటం వలన మిలాటోనిన్ లెవల్స్ పెరుగుతాయి దాంతో సుఖమైన నిద్ర పడుతుంది. అరటిలో ఉండే పొటాషియం, మెగ్నిషియం శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ లెవల్స్ పెంచి కండరాలలో నొప్పిని తగ్గించి నిద్ర పట్టేలా చేస్తాయి. కొంత మందికి భోజనం తర్వాత స్వీట్స్ తినే అలవాటు ఉంటుంది అలాంటప్పుడు స్వీట్స్ తినకుండా అరటిపండు తింటే చాలా మంచిది.

## వివిధ రకాలు

అరటి పండ్లలో చాలా రకాలు ఉంటాయి. గ్రీన్ కలర్ అరటి పండ్లు, పసుపు రంగు అరటి, మచ్చల అరటి, బ్రౌన్ కలర్ అరటి. అయితే వీటిలో ఒక్కో రంగు అరటి పండు ఒక్కో విధంగా ఉపయోగపడుతుందట. బాగా పండిన లేదా రంగు మారిన అరటి పండ్లను పడేయకూడదట. వాటిని తినడం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గుతుంది. బ్రౌన్ కలర్ అరటి పండ్లలలో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. వాటిని జ్యూస్ చేసుకొని తాడగం కానీ బానానా బ్రెడ్‌గా చేసుకొని తింటే మంచిదని చెబుతున్నారు. ఇక గ్రీన్ కలర్ అరటిపండ్లు షుగర్ పెరగకుండా కాపాడుతాయి. ఈ కలర్ అరటి పండ్లు నెమ్మదిగా జీర్ణమవుతాయ. దీని వల్ల రక్తంలో గ్లూకోజ్ పరిమాణం నెమ్మదిగా పెరుగుతాయి. పసుపు రంగు అరటి పండ్ల సులభంగా జీర్ణమై బలాన్ని ఇస్తాయట. మచ్చలు ఉన్న అరటిలో ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఈ కలర్ అరటి పండు చాలా రుచికరంగా ఉంటుంది కానీ మిగతా అరటి పండ్ల కంటే వీటిలో పోషకాలు కాస్త తక్కువట.

## సౌందర్య ప్రయోజనాలు

అరటిపండు గుజ్జులో స్పూన్ తేనె కలిపి ముఖానికి అప్లయి చేస్తే చర్మానికి మాయిశ్చరైజర్ లభించి ముఖం మెరుస్తుంది. అరటిపండు గుజ్జు, తేనె, బాదం పప్పుల పొడి కలిపిన పిస్ట్ కూడా మంచి ఫలితం ఇస్తుంది. అరటిపండులో బెల్లం కలిపి ముఖం, మెడ స్క్రబ్ చేస్తే మృతకణాలు పోతాయి. అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. పిల్లలు రోజుకో పండు తింటే ఆస్తమా పెరిగే అవకాశం 34 శాతం తక్కువగా ఉంటుంది. అరటిపండులో ఫైబర్, పొటాషియం, విటమిన్ సి, బి6లు గుండె ఆరోగ్యానికి సపోర్ట్ చేస్తాయి. డయాబెటిక్ రోగులు మధ్యస్తంగా ఉన్న ఒక అరటిపండు తింటే మూడు గ్రాముల పీచు శరీరానికి లభిస్తుంది. ఇన్సులిన్ స్థాయి మెరగవుతుంది. బ్రేక్ ఫాస్ట్‌లో, లంచ్‌లో అరటిపండు తింటే విద్యార్థులు మరింత బ్రెయిన్ పవర్‌తో ఉంటారు. మూడ్‌ను క్రమబద్ధీకరించే ట్రెప్టోఫిన్ అనే పదార్థాన్ని అరటిపండ్లు విడుదల చేస్తాయి. దీని వల్ల సంతోషం పెరుగుతుంది.

కొంచెం కారంగా.. కొంచెం పుల్లగా కాస్త పుల్లగా ఉన్నవి ఏమైనా తింటుంటే భలే ఉంటుంది కదా.. అలాగని వాటిని తయారు చేయడానికి ఎక్కువ సమయం పట్టకుండా వెంటనే చేసుకోగలగాలి. రుచి మాత్రం అదిరిపోవాల్సిందే అనుకుంటు న్నారా? అయితే ఓసారి ఈ మరమరాల రుచులను ప్రయత్నించండి.

విందు-పసందు

# మరమరాల రుచులు

## దోస



**కావలసినవి:** మరమరాలు-రెండు కప్పులు, బొంబాయిరవ్వ-కప్పు, పెరుగు-అరకప్పు, బేకింగ్ పౌడర్ -అర టీస్పూన్, ఉప్పు రుచికి సరిపడా, నూనె తగినంత.

**తయారీ:** మరమరాలను నీళ్లలో, బొంబాయి రవ్వను పెరుగులో పది నిమిషాల చొప్పున నానబెట్టాలి. తర్వాత మరమరాలను ఫిల్టర్‌లో వేసి నీళ్ల లేకుండా వడకట్టాలి. ఇప్పుడు మరమరాలు, పెరుగులో నానబెట్టిన బొంబాయి రవ్వలో కొన్ని నీళ్ల పోసి మిక్సీలో వేసి మెత్తగా పిండి పట్టాలి. దీంట్లో ఉప్పు, బేకింగ్ పౌడర్ వేసి బాగా కలపాలి. బేకింగ్ పౌడర్ లేకపోతే బేకింగ్ సోడానైనా తీసుకోవచ్చు. బేకింగ్ పౌడర్ నీళ్లలో కలిపితే పిండిలో బాగా కలుస్తుంది. ఇప్పుడు పెనానికి నూనె రాసి గరిటెడు పిండితో దోశ పోసి పైన మూత పెట్టాలి. ఒకవైపు ఎర్రగా వేగిన తర్వాత తీసేయాలి. దోశ కరకరలాడుతూ ఉండాలంటే పిండిని మరింత పల్చగా చేసుకోవాలి. ఈ పిండితో స్పాంజిలా మెత్తగా లేదా కరకరలాడేలా దోశ వేసుకోవచ్చు. ముందురోజు మినపప్పు, బియ్యం నానబెట్టడం లాంటివి ఏమీ లేకుండా ఇలా. సులువుగా దోశలను సిద్ధం చేసుకోవచ్చు. పల్లీ/కొబ్బరి చట్నీతో తింటే ఇవి చాలా బాగుంటాయి.

## స్వీట్



**కావలసినవి:** మరమరాలు-రెండు కప్పులు, బెల్లంపొడి -కప్పు, కాచి చల్లార్చిన పాలు-ఒక గ్లాసు, జీడిపప్పు, పల్లీలు-గుప్పెడు చొప్పున, నెయ్యి -రెండు టీస్పూన్లు, యాలకుల పొడి -చిటికెడు.

**తయారీ:** వెడల్పాటి పాత్రలో మరమరాలు జీడిపప్పు, పల్లీలను వేయించుకోవాలి. చల్లారిన తర్వాత మిక్సీలో వేసి పిండి చేయాలి. పాలల్లో బెల్లం పొడి వేసి కరగనివ్వాలి. తర్వాత మరమరాలు, యాలకుల పొడి వేసి ఉండలు లేకుండా గట్టిగా కలపాలి. ఈ మిశ్రమాన్ని నెయ్యి రాసిన గిన్నెలో వేసుకుని ముక్కలు కోసుకోవాలి. ఈ స్వీటు చేసుకునేటప్పుడు కొంచెం పిండిని పక్కన పెట్టుకుంటే మంచిది. మిశ్రమం పల్చగా అయితే దాన్ని కలపొచ్చు. పిండి అయితే బాగా పాలు పోసుకోవచ్చు. కొబ్బరి తురుము వేసుకుంటే రుచి పెరుగుతుంది. బెల్లంతోనే కాకుండా పంచదార పొడితోనూ చేసుకోవచ్చు..

## ఉగ్గాణి



**కావలసినవి:** మరమరాలు-పావుకేజీ, ఉప్పు-తగినంత, పచ్చిమిర్చి-మూడు, కరివేపాకు-రెండు రెబ్బలు.

**పొడి కోసం:** ఎండుమిర్చి-3, వేయించిన శెనగపప్పు-పావుకప్పు, ఎండుకొబ్బరిపొడి-రెండు టేబుల్స్పూన్లు. తాలింపు కోసం: ఆవాలు, జీలకర్ర రెండు టీస్పూన్ల చొప్పున, ఎండుమిర్చి-మూడు, ఉల్లిపాయల తరుగు-పావు కప్పు, టొమాటో తరుగు-అరకప్పు, కారం అర టీస్పూన్, కరివేపాకు రెబ్బ-ఒకటి, కొత్తిమీర తరుగు-గుప్పెడు.

**తయారీ:** మరమరాలను నీళ్లలో వేసి నిమిషం తర్వాత పిండి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడే ఉప్పు కలిపితే మరమరాలకు బాగా పడుతుంది. ఎండు మిర్చి, శెనగపప్పు, ఎండుకొబ్బరిపొడిని మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. పచ్చిమిర్చి, కరివేపాకును కచ్చాపచ్చాగా దంచుకోవాలి. పచ్చిమిర్చిని చిన్న ముక్కల్లా కోయకుండా దంచితే రుచిగా ఉంటుంది. కడాయిలో నూనె పోసి వేడిచేసి ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి వేసి వేయించాలి. తర్వాత ఉల్లిపాయ తరుగు, కరివేపాకు జతచేసి రెండు నిమిషాలు వేయించాలి. ఇప్పుడు టొమాటో తరుగు, పసుపు వేయాలి. టొమాటో తరుగు మెత్తబడి, నూనె పైకి తేలేంత వరకూ వేయించి కారం కలపాలి. నానబెట్టిన మరమరాలు, తయారు చేసి పెట్టుకున్న పొడి, కొత్తిమీర తురుము ఉప్పు కలిపి కాసేపు వేయించాలి. చివరిగా మిర్చీ లేదా అరటికాయ బజ్జీని చిన్న ముక్కల్లా కోసుకుని కలిపితే రాయలసీమ వాసులు ఎంతో ఇష్టంగా తినే ఉగ్గాణి సిద్ధమవుతుంది.

# కనువిప్పు

మహేంద్రగిరి రాజ్యాన్ని శాంతివర్మ పరిపాలిస్తున్నాడు. రాజ్యంలో కరువు లేదు. ప్రజలను కన్న బిడ్డలవలే చూసుకుంటున్నాడు. ప్రజలకు ఎలాంటి పన్నులు లేవు. ప్రజలు కష్టపడి పనిచేస్తారు కాబట్టి రాజ్యం ముందుకు పోయింది. శాంతివర్మ కూడ పేరుకు తగ్గట్లు శాంతియుతంగానే ఉంటాడు. యుద్ధం ఎట్టి పరిస్థితులలో చేయడు. సైన్యం తక్కువ అయినా మెరికెల్లాంటి వీరులు ఉన్నారు.

పక్కనే కొండ కింద ఉన్న విజయపురి రాజ్యం దీనికి భిన్నం. ఉగ్రసేనుడు ఆ రాజ్యానికి అధిపతి. మహేంద్రగిరిని ఆక్రమించాలని, ఆ రాజ్యాన్ని తన భూభాగంలో కలిపేసుకోవాలని ఆలోచన చేశాడు. మహేంద్రగిరి సైన్యం కంటే పెద్ద సైన్యం కలిగి ఉన్నాడు. వేగుల ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్నాడు. ఏమాత్రం అలస్యం చేయకుండా "రేపు యుద్ధానికి సిద్ధంగా ఉండు" అని వర్తమానం పంపాడు.



ఊహించని పరిణామానికి ఆశ్చర్యపోయాడు శాంతివర్మ.. "సరే" అని సైన్యాన్ని సిద్ధం చేశాడు. ఇద్దరు రాజులు శంఖం పూరిస్తూ ఎదురుపడ్డారు. ఉగ్రసేనుడు మీసం మెలేస్తూ కనుసైగతో రమ్మని ఆహ్వానం పలికాడు. శాంతివర్మ వారి సైన్యం వంక చూసి "మాకు యుద్ధం చేయాలని ఉబలాటం లేదు. యుద్ధం వల్ల పౌరులు నష్టపోతారు. సైనిక కుటుంబాలు, వారి పిల్లలు నష్టపోతారు. ఉగ్రసేన మహారాజా! మా రాజ్యం మీకు కావాలంటే ఇప్పుడే ఇస్తాను. నన్ను బంధించండి. మీ సైన్యాధిపతికి అనుమతి ఇవ్వండి" అన్నాడు.

ఉగ్రసేనుడు భీకరంగా తన సైన్యాధిపతి సుశర్మ వంక చూసి "అతన్ని బంధించి తీసుకురా!" అని ఆజ్ఞాపించాడు. కొన్ని క్షణాలు అక్కడ మౌనం రాజ్యమేలింది. సుశర్మ తన కిరీటం, కత్తి తీసి "యుద్ధం వద్దు అనుకునేవాళ్ళు నాతో రండి" అనగానే సైన్యమంతా సుశర్మ వెంట నడిచింది. మెల్లమెల్లగా సైనికులందరూ శాంతివర్మ సైన్యంలో కలుస్తున్నారు.

అనుకోని సంఘటనకు ఉలిక్కి పడ్డాడు ఉగ్రసేనుడు. శాంతివర్మతో కలిసిన సుశర్మ "ఉగ్రసేన మహారాజా! మేం కూడా యుద్ధానికి విముఖమే. శాంతివర్మ మహారాజు చెప్పింది అక్షరాలా నిజం. యుద్ధం అన్ని అనర్థాలకు మూలం" అన్నాడు.

శాంతివర్మ కల్పించుకుని "రాజా! మీకు ఏమైనా సహాయ సహకారాలు కావాలంటే నేను మద్దతు ఇస్తాను. యుద్ధం మాత్రం వద్దు, శాంతి, సహకారం మనకు ముఖ్యం" అన్నాడు.

ఆ మాటకు తల దించుకున్నాడు ఉగ్రసేనుడు. శాంతివర్మ మహారాజుకు జై అని పలుకుతుంటే "సుశర్మా! మీ సైన్యాన్ని తీసుకువెళ్లు" అన్నాడు. అశ్వం దిగిన ఉగ్రసేనుడు కిరీటం, కత్తి తీసి ముందుకు నడుస్తూ "రాజా! మీ మాటలు నా కళ్లు తెరిపించాయి. సైనికులకు కూడా యుద్ధం చేయటం ఇష్టం లేదు. యుద్ధం వల్ల నష్టం జరుగుతుందని నేను అంత దూరం ఆలోచించలేకపోయాను. నన్ను క్షమించు. నా రాజ్యాన్ని కూడా మీరే తీసుకోండి" అన్నాడు.

దానికి శాంతివర్మ "మనం సోదరుల్లా కలిసి మెలసి ఉండాలి. కష్టనష్టాలు ఇద్దరం కలసి ఎదుర్కొందాం, చక్కగా రాజ్యాలను పరిపాలించుకుందాం. ప్రజలను కన్నబిడ్డలవలే చూసుకుందాం" అన్నాడు.

ఆ మాటకు ఉగ్రసేనుడు "మహారాజా! అని ఆనందంగా ఆలింగనం చేసుకున్నాడు. "శాంతివర్మ మహారాజుకు, ఉగ్రసేన మహారాజుకు జై" అనే నినాదాలతో ఆ యుద్ధ భూమి శాంతించింది.

– కనుమ ఎల్లారెడ్డి



వార్త ఆదివారం

## బాలగేయం

### వేసవి స్నేహం

భూమాతని
పలకరిద్దామా?
నీ తల్లి ఏదని!
ఆకాశాన్ని
అడిగేద్దామా?
మీ నాన్న ఎవరని!

చెట్టూ పుట్టని
కదిపేద్దామా
నీ చెల్లి అక్క యేరని!
ఈగ దోమని
కదిలిద్దామా
నీ అన్నా తమ్ముడు
ఎక్కడని !
ఆవు దూడని
కలిసొద్దామా
పాలు నీళ్లు తాగేరా
అని
బడి మడి
చూసొద్దామా
ఎలా ఉన్నారో అని !
వేసవి సెలవులంతా
చాటేద్దామా
ఒకరికొకరం స్నేహం
పెంచుకోవాలని !!

- తిప్పాన హరిరెడ్డి

## హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు
వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

### గిరీష్ అంకుల్ సమాధానాలు

కావ్య, కనిగిరి

**ప్రశ్న: అగ్నిపర్వతాల వలన నష్టాలేనా? లాభాలు కూడా ఏమైనా ఉన్నాయా? వివరించగలరు.**

**జవాబు:** లాభ, నష్టాలనేవి ప్రకృతికి సహజాతి సహజ లక్షణం. భూమి ఏర్పడిన తొలి దశలో అగ్నిపర్వతాల వల్లనే భూమి మీద సముద్రాలు, పర్వతాలు, పీఠభూములు, చదునైన ప్రదేశాలు ఏర్పడటం వల్ల అద్భుతమైన నైసర్గిక స్వరూపం రూపుదిద్దుకున్నది. లావా ప్రవహించిన నేల ఏ రైతూ ఊహించలేని విధంగా అత్యంత సారవంతమైనదిగా మారుతుంది. అగ్నిపర్వతాలు మొక్కలకు అవసరమైన కార్బన్-డై-క్సైడ్‌ను అందిస్తాయి.

అగ్నిపర్వతాల నుంచి వెలుపలికి దూసుకువచ్చిన శకలాలను భవన నిర్మాణాలలో, రసాయన పరిశ్రమలలోను విరివిగా ఉపయోగిస్తారు. మరో విశేషమేమిటంటే- ఉత్తర కాలిఫోర్నియాలో అగ్నిపర్వత ప్రజ్వలనం వల్ల ఉత్పన్నమైన శక్తిని విద్యుచ్ఛక్తిగా మార్చి శాన్‌ఫ్రాన్సిస్కో నగరానికి విద్యుత్‌ను అందిస్తున్నారు.

విపిన్, పాల్వంచ

**ప్రశ్న: స్వీట్ తిన్న వెంటనే టీ తాగితే చప్పగా అనిపిస్తుంది. కారణమేమిటి?**

**జవాబు:** మన నాలుక మీద వేర్వేరు రుచులను గుర్తించే టేస్ట్ బడ్స్ (రుచి కేంద్రాలు) ఉంటాయి. బాగా అధిక స్థాయి తీపిపదార్థాన్ని తిన్నప్పుడు, ఈ రుచిని గుర్తించే టేస్ట్ బడ్స్ పూర్తిగా ఉత్తేజితమవుతాయి. వెనువెంటనే టీ తాగితే అందులో తక్కువ స్థాయిలో ఉన్న తీపి రుచిని అప్పటికే పూర్తిగా ఉత్తేజిమై వున్న టేస్ట్ బడ్స్ వ్యక్తీకరించలేవు. ఈ కారణంతోనే మనకు టీ రుచిలోని తీపిదనం తెలియక చప్పగా ఉన్నట్లు అనిపిస్తుంది.



# నాన్నలా మారిపోయా..

సింగంపల్లి శేష సాయి కుమార్

సింగిల్ పేజీ కథ

"అవును.. నేను మారిపోయాను. ఆ విషయం నాకు స్పష్టంగా అర్థమవుతోందని అనుకుంటుండగా దూరం నుంచి "హలో సార్! ఈ మందులు త్వరగా తీసుకురండి. బిడ్డను రెండు రోజుల పాటు లైట్ కింద పెట్టాలి, అప్పుడే కామెర్లు రాకుండా ఉంటాయి" అంది నర్సు. వెంటనే వెళ్లి కావలసిన మందులన్నీ తీసుకొచ్చి డోర్ బయటి నుంచి అందించాను. ఐ.సీ.యు. అద్దాల తలుపుతో ఉంది. అందులో నుండి కళ్ళు పెట్టి చూస్తే ఎదురుగా ఒక తెల్లటి బల్ల, దానిపై ఒక పలుచటి గుడ్డ, దానిపై కాళ్లు చేతులు గట్టిగా ఆడిస్తున్న బిడ్డ. బిడ్డ ఏ రంగో కనపడడం లేదుగానీ, పైనుండి మాత్రం ఒక నీలపు రంగు కాంతి పడుతోంది. ఆ కాంతి బిడ్డ కళ్లల్లోకి పడకుండా కళ్ళకి ఒక గుడ్డ కట్టేసారు. ఒక్క క్షణం బిడ్డను చూసి మనసు ఉప్పొంగిపోయింది.

..............

ఊళ్లో మా నాన్నకంటూ కొన్ని విలువలున్నాయి. ఎవరి దగ్గరా చేయి చాపడు. తనకున్న దాంట్లో బిడ్డలను పెంచి సంసారం చేయాలన్నది ఆయన తత్వం. మమ్మల్ని చదివించిందంతా గవర్నమెంటు బడుల్లోనే. నేను పది పాస్ అయ్యాను. ఇంటర్‌లో ఎక్కడ చేర్చాలని ఆలోచిస్తోంది అమ్మ.

"వాణ్ణి ఎక్కడ చేర్చినా చదవాల్సింది వాడే కదా, ఎక్కడ చెప్పినా చదువు ఒకటే, చదుకోవాలని వాడికుంటే వాడే చదువుకుంటాడు" అన్నాడు నాన్న.



మా నాన్న ఎప్పుడూ ఇంతే. అందరి తల్లిదండ్రులు పిల్లలు పరీక్షలు రాస్తుంటే వాళ్ళతో పాటు వచ్చి రూం దగ్గర వదిలిపెట్టి, డ్యూటీలో ఉన్న ఇన్విజిలేటర్లకు వీడు మా వాడు, కాస్త చూసుకోమని అప్పచెప్పి మరీ వెళ్ళేవారు. కానీ మా నాన్న మాత్రం అటువైపు తిరిగి చూసేవాడు కాదు.

"వాడికొచ్చింది రాయని, మనం వెళ్లి అందరినీ అడగడం ఎందుకు?" అనేవాడు. చదువంతా ఒకవైపు అయితే చిన్న వయస్సులో నాకు వచ్చిన ఆరోగ్య సమస్యలు మరొక వైపు. భాష రానిచోట ఎన్ని అగచాట్లు పడ్డారో కానీ మొత్తానికి ఒక మనిషిని చేసి నిలబెట్టారు. నా పేరు సోము. ఉద్యోగం వచ్చిన ఆరు నెలలకే సంబంధం కుదిరింది. పెళ్లికి చాలా మంది రాకపోయినా పెళ్లి మాత్రం అనుకున్న ముహూర్తానికి జరిగింది. ఇక నాకు వచ్చిన ఉద్యోగం నేను కష్టపడి తెచ్చుకున్నది కాదు. మా నాన్న చనిపోతే ఆ ఉద్యోగం కారుణ్య నియామకం కింద నాకు ఇచ్చారు.

మా నాన్న బతికి ఉన్నన్నీ రోజులు నేను చేసే ప్రైవేటు ఉద్యోగానికి పిల్లని ఇవ్వమని ఎవరిని అడిగినా ప్రైవేటు ఉద్యోగస్తుడా! గవర్నమెంట్ ఉద్యోగం అయితే బాగుండు అంటూ మాటలు దాటవేశారు. ఆయన ఏమనుకున్నాడో ఏమో తన ఉద్యోగాన్ని నాకు ఇచ్చి పెళ్లి కూడా చేసేసాడు. కానీ పెళ్లిలో ఆయన లేకపోవడం ఒక్కటే లోటు. పెళ్లి జరిగి రెండేళ్లు. ఇన్నాళ్లకు మా నాన్న మళ్లీ తిరిగి భూమి మీదికి వచ్చే సమయం ఆసన్నమైందని అనిపించింది.

అవును.. నేను నాన్నను కాబోతున్నానని ఎంతో ఆనందపడ్డాడు కానీ పుట్టే బిడ్డ మగ బిడ్డ అయితే చాలా బాగుంటుంది అనుకున్నాను, ఎందుకంటే ఇంటికి మహాలక్ష్మి వద్దని కాదు, మగ బిడ్డ పుడితే మా నాన్న తిరిగి మళ్లీ చూసుకోవచ్చు అన్న చిన్న కోరిక, ఆ కోరిక అక్షరాల నెరవేరింది. మా నాన్న మళ్లీ తిరిగి వచ్చేసాడు. కృష్ణ అని పేరు పెట్టుకున్నాం.

..............

నా కొడుకు పెరిగి పెద్దవుతున్నాడు. వాడు ఇప్పుడే చాలా చురుగ్గా ఉన్నాడు. వాడికి తెలివితేటలకు ఒక్కొక్కసారి ముచ్చటేస్తుంది. ఇంకొక్కసారి భయమేస్తుంది. ఎందుకంటే వాడు ఇప్పుడే ఎక్కడెక్కడ ఏం చెప్పాలో ఎక్కడెక్కడ ఏం మాట్లాడాలో బాగా అర్థమవుతోంది. వాడికి పట్టుమని మూడేళ్లు. నేను కూడా ఆ వయసులో ఇంత హుషారుగా లేనేమో అని ఎన్నోసార్లు మా అమ్మని అడిగి ఉంటాను.

ఇక వాడిని స్కూల్‌కు పంపించాల్సిన సమయం వచ్చేసింది. ఇంతకుముందు అంత నాకు పుట్టబోయే బిడ్డను ప్రవేట్ స్కూల్‌కు పంపించను, గవర్నమెంట్ స్కూల్‌కి పంపిస్తాను. అయినా ప్రైవేట్ స్కూల్లో కట్టే ఫీజులను వాడి పేరు మీద జమ చేస్తే కనీసం వాడి అవసరాలకైనా సరిపోతుంది. చదువు అనేది ఎక్కడైనా ఒకటే కదా అంటూ మా నాన్న చెప్పిన మాటలు నేను చెప్పేవాడిని కానీ ఎందుకో ఇప్పుడిప్పుడే మాటల్లో "వాడిని ఏ స్కూల్లో చేర్పిద్దాం? సంవత్సరానికి ఎంత ఖర్చవుతుంది? ఆ స్కూల్లో చదివే పిల్లలు ఎలా ప్రవర్తిస్తున్నారు? చుట్టుపక్కల పిల్లలు ఎవరైనా ఉన్నారా? వాడిని వదిలి మళ్లీ తీసుకురావడానికి మనం ఏం చేయాలి?" అంటూ ఇంట్లో అప్పుడప్పుడు తెగ చర్చలు చేస్తున్నాను నాకు తెలియకుండానే.

చిన్న చిన్న విషయాల్లో మా నాన్న అభిప్రాయాన్ని తప్పు పట్టిన నేనే ఇప్పుడు మళ్లీ ఆయన నిర్ణయాన్ని పాటిద్దాం.. అని నాకు తెలియకుండానే జరిగిపోయాయి. ఎందుకంటే నేను ఇప్పుడు నాన్న అయ్యాను కాబట్టి. ఒక్కొక్కసారి నాకు అనిపిస్తుంది నేను మారిపోయాను అని. నాన్న తాను తీసుకొన్న నిర్ణయాలలో మంచి, చెడ్డ అని చెప్పగలిగే స్థాయి కానప్పటికీ నా తీర్పును నాకు అనుకూలంగా ఇచ్చుకునే వాడిని. కానీ ఇప్పుడు నేను ఆయన స్థానంలో ఉంటే నాకు అర్థం అవుతోంది ఏ నిర్ణయం తీసుకోవాలి, ఆ నిర్ణయం తీసుకున్నాక పర్యవసానాలు ఏమిటి అని! ఎవరైనా అంతే! నాన్న విలువ నాన్నయ్యాకే తెలుస్తుంది. అందుకే నేను నాన్నలా మారిపోయాను.. అవును..నేను మారిపోయాను.



# విభిన్న రంగుల కొండ

**నార్త్** ఆస్ట్రేలియాలో ఉలూరు అనే ఒక రాతికొండ ఉంది. సూర్యకాంతి పడే కోణం, వాతావరణాన్ని బట్టి ఈ కొండ వివిధ రంగుల్లోకి మారుతుంది. ఈ రాతిలోపల ఉంటే అరుదైన మినరల్స్ వల్ల కొండ రంగులు మారుతూ కనిపిస్తుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ ప్రత్యేకత వల్లనే యునెస్కో గుర్తింపు పొందింది.

1873లో ఓ ఇంగ్లిష్ యాత్రికుడు ఈ కొండను కనుగొన్నట్లు తెలుస్తోంది. ఈ రాతికొండ ఓవల్ ఆకారంలో సుమారు మూడు వందల యాభై మీటర్ల ఎత్తు, రెండు కిలోమీటర్లు పైగా విస్తరించి వుండటం విశేషం. ఉదయం పూట ఈ కొండపై సూర్యకిరణాలు పడినప్పుడు కొండ పర్పుల్, ఎరుపు రంగులో కనిపిస్తుంది. సూర్యాస్తమయ సమయంలో పర్పుల్ రంగులో మాత్రమే కనిపిస్తుందట. రోజంతా ఆరెంజ్, పసుపు... ఇలా విభిన్న రంగుల్లో కనిపిసునతన్న ఈ కొండను చూడటానికి జనాలు క్యూ కడుతున్నారనటంలో ఇక వింతేముంది!

# పంటినొప్పి వస్తే!

**నేపాల్** రాజధాని ఖాట్మండ్‌లోని థామెల్ ఖాట్మండు దర్బార్ దగ్గర ఓ పెద్ద చెట్టుకు సంబంధించిన మొద్దు ఉంటుంది. అందులో విశేషం ఏముందంటారా? దానిపై కొన్ని వేల సంఖ్యలో నేపాలీ రూపాయి నాణేలు అతికింది ఉంటాయి. అదే విశేషం. క్రీ.శ. 400-750 మధ్య కాలంనాటి బంగేముధ చెట్టుకు సంబంధి చిన మొద్దు అనీ, దాని ప్రధాన రంధ్రంలో వైషాదేవ్ అమ్మవారు వెలిసారని భక్తుల నమ్మకం. ఇంతకు అసలు విషయం ఏమిటంటే ఎవరికైనా పంటి నొప్పి వస్తే ఆ దేవతకు పూజ చేసి, మొద్దుపై రూపాయి నాణేలను అతికిస్తారు. అమ్మవారు అనుగ్రహించి పంటినొప్పి నుంచి ఉపశమనం కల్పిస్తారని వారి విశ్వాసం. పంటినొప్పే కాదండోయ్.. పంటికి సంబంధించిన ఏ చిన్న సమస్య వచ్చినా అమ్మవారు ఆ వ్యాధిని నయం చేస్తారని వారి నమ్మకం. కొన్ని సంవత్సరాల క్రితం మొద్దులో ఉండే అమ్మవారి విగ్రహాన్ని దొంగలు ఎత్తుకెళ్లారట. అయినా అక్కడున్న పసుపు, కుంకుమలనే దేవతగా భావించి భక్తులు పూజలు చేయడం గమనార్హం.



కాలక్రమంలో ఈ విషయం అందరికీ పాకిపోవటంతో భక్తులతో పాటు పర్యాటకులూ రావడం మొదలైంది. డెంటిస్టులు ఆ మొద్దు పరిసర ప్రాంతాల్లో డెంటల్ హాస్పిటల్స్‌ను ఏర్పాటు చేయటం కొసమెరుపు.

ఇంకేముంది.. ఇప్పుడు ఆ ప్రాంతం వింత ఆలయంతో పాటు దంత వైద్యులకు కేరాఫ్ అడ్రసుగా మారిపోయింది.

**ప్రపంచంలోని** అతి చిన్న అంతర్జాతీయ వారధి ఇది. దీనిని 'మార్కో ఇంటర్నేషనల్ బ్రిడ్జ్' అని అంటారు. ఈ వంతెన 6 మీటర్ల పొడవు, 1.45 మీటర్ల వెడల్పు ఉంటుంది. స్పెయిన్‌లోని ఎల్ మార్కో గ్రామం నుండి పోర్చుగల్‌లోని వర్జియా గ్రాండ్‌ల మధ్య ఉండే చిన్న వాగును దాటేందుకు దీనిని వెదురు బొంగులతో నిర్మించారు. ఈ వంతెన మీదుగా పాదచారులు, టూ వీలర్స్‌ను మాత్రమే ప్రయాణించడానికి అనుమతిస్తారు. పర్యాటకులకు ఇదొక ప్రత్యేక ఆకర్షణగా మారిపోయింది. అసలు సంగతేమిటంటే ఇది రెండు వేర్వేరు టైమ్ జోన్‌ల పరిధిలో ఉంది. స్పెయిల్ వైపు సెంట్రల్ యూరోపియన్ టైమ్; పోర్చుగీస్ వైపు గ్రీన్విచ్ మీన్ టైమ్ జోన్‌లో ఉండి. ఈ వంతెన మీదుగా ప్రయాణించినపుడు టైమ్ ట్రావెల్ చేసిన అనుభూతి మన సొంతమవుతుంది.



# చిన్న అంతర్జాతీయ వారధి

# నిస్వార్థం

పంతంగి శ్రీనివాసరావు

కథ

**ఆమెను నిత్యం గమనిస్తూనే ఉన్నాడు సంజీవి. ప్రతి గురువారం, శనివారాలు ఆమె వద్దనే పువ్వులు కొంటుంటాడు. సంజీవి ఓ ప్రముఖ దినపత్రికలో ఎడిటోరియల్ స్టాఫ్‌లో సీనియర్. ఎన్నో పరిశోధనాత్మక కథనాలు అతని కలం నుంచి జాలువారాయి. పాఠకులు అతని ఆర్టికల్స్‌ను ఎంతో ఇష్టంగా చదువుతుంటారు. అటువంటిది ఆమె అతడిని ఆకర్షించడానికి కారణం.. నడుము వంగిపోయినా, ఆమె కష్టపడే విధానం చూస్తుంటే ఎంతో జాలి కలుగుతోంది. ఒక్క రూపాయి కూడా అదనంగా ఉంచుకోదు.**

ఒకరోజు తిరిగి చిల్లర ఇవ్వడానికి ఆమె దగ్గర రెండు రూపాయల కాయిన్ దొరకలేదు. ఎంత వెదికినా...

"ఫర్వాలేదు, వుండనివ్వు పెద్దమ్మా" అని చెప్పాడు సంజీవి.

"అందరూ పెద్ద నోట్లే ఇస్తారు బాబూ.. చిల్లర సమస్య" అని ఆగి–

"పోనీ, దానికి తగ్గ పూలు తీసుకుంటారా? అని అడిగింది.

"అవసరం లేదులే పెద్దమ్మా.." అంటూ ఆమె పిలుస్తున్నా ఆగకుండా వెనుదిరిగాడు సంజీవి. మరో రెండు రోజుల తర్వాత శనివారంనాడు ఆమె దగ్గరకు వచ్చాడు సంజీవి.

"పూలు ఇస్తావా పెద్దమ్మా.." అడిగాడు.

ఆమె పూలు ఇచ్చింది.

అతను దాగిన దానికి తగిన చిల్లర ఇచ్చాడు.

అందులోంచి ఒక రెండు రూపాయల కాయిన్ తిరిగిచ్చి, ఇంతకుముందు మీకు బాకీ పడినాను బాబూ" చెప్పింది.

ఆమె నిజాయితీకి అబ్బురపడ్డాడు సంజీవి.

"ఈ వయస్సులో ఇంతగా కష్టపడుతున్నావు, మీ ఇంట్లో మొగవాళ్ళు ఎవరూ లేదా పెద్దమ్మా?" అడిగాడు.

ఆమె ఒక చిరునవ్వు నవ్వింది.

"మన్నించవ్వా.. మీ వ్యక్తిగత విషయాలు..."

"అదేమీ లేదు బాబూ.. పెళ్లయిన నాలుగేళ్లకే మా ఆయన.." చేతులు పైకెత్తి ఆకాశం వేపు చూపించింది.

"అయ్యో పాపం.. మరి నీకు అన్నదమ్ములు..!"

"మా అమ్మా నాన్నలకు నేను ఒక్కదానినే"

".. ఇలా అడుగుతున్నందుకు ఏమీ అనుకోవద్దమ్మా... మీకు మేనమామలు.. వారి సంతతి.. బంధుజనం"

"నేను ఒంటరిని బాబూ" అని ఆగి–

"ఇక నా వారసత్వం, ఆస్తిపాస్తులు అంటూ అడుగుతావని తెలుసు.. అని చిద్విలాసంగా నవ్వి.."మా తాతగారు ఉన్న ఆస్తిని స్వాతంత్రోద్యమానికి ధారపోసిన మహనీయుడు. మా అమ్మను కూడా ఆ ఉద్యమంలోకి నడిపించిన గొప్ప వ్యక్తి.." ఆమె మాటల్లో ఎంతో గర్వం.

"ఏమిటి! మీది స్వాతంత్రోద్యమ కుటుంబమా! ఇంట్రస్టెడ్.. నేను పత్రికాఫీసులో పని చేస్తాను. మీ అమ్మగారి గురించి కొన్ని వివరాలు చెపుతావా?" అడిగాడు సంజీవి.

పూలబండి పక్కకు తీసి.." మీరు తరచూ నా వద్దకు వస్తుంటారు. మాలిమి అయ్యారు. తప్పకుండా చెబుతాను బాబూ.." అంటూ శ్వాస తీసుకుని వదిలింది కొద్దిసేపు.

అనసూయ.. కలిగినింట పుట్టి గారాబంగా పెరిగిన పడతి, తల్లిదండ్రులకు ఏకైక సంతానం. తండ్రి రామచంద్ర రావు. అతడు సుభాష్ చంద్రబోస్ అనుచరుడు. అవి స్వాతంత్ర్య సమరం ఉవ్వెత్తున సాగుతున్న రోజులు. ప్రతి ఒక్కరిలోనూ స్వరాజ్య కాంక్ష పెల్లుబుకుతోంది. వారసత్వంగా చేకూరిన అపార సంపదకు హక్కుదారుడు అతను.

తండ్రితో పాటు, తమ ఇంటికి వచ్చేవారిని నిశితంగా గమనించసాగింది అనసూయ. తమ ఇల్లు 'జైహింద్' నినాదాలతో మారుమోగిపోతుంటే తనూ అరిచేది వారితో కలిసి.

అనసూయకు యుక్త వయస్సు వచ్చింది. తన ప్రియ అనుచరుడు భరద్వాజతో కూతురు అనసూయ వివాహాన్ని సంప్రదాయబద్ధంగా జరిపించాడు రామచంద్ర రావు.

రెండేళ్ల తిరిగేసరికి అనసూయ–భరద్వాజ దంపతులకు ఒక కూతురు జన్మించింది.



మనవరాలికి స్వరాజ్యం అని పేరు పెట్టి తన దేశభక్తిని చాటుకున్నాడు రామచంద్ర రావు. తను తాత అయినందుకు ఎంతో మురిసి పోయాడు.

ఇలా వుండగా, ఒక అర్ధరాత్రి సమయంలో రామచంద్రరావు బంగళాలో కొంతమంది నాయకులు సమావేశమయ్యారు. ఉద్యమ ఉధృతిని మరింతగా ఎలా వ్యాప్తి చేయాలో చర్చించుకుంటున్నారు.

ఇంతలో.. హఠాత్తుగా బ్రిటిష్ దళం ఆ ఇంటిని చుట్టుముట్టింది. లోపల వున్నవారు అందరూ మేడ పైనుంచి దూకి పలాయన చిత్తగించారు. ఓ నలుగురు మాత్రం పట్టు బడ్డారు. వారిలో ఒక వ్యక్తి నింపాదిగా వెళ్లడాన్ని అనసూయ గమనించకపోలేదు. అతడిని చూసి ఆశ్చర్యపోవడం ఆమె వంతయింది.

తమ ఇంటిలో రహస్య సమావేశం గురించి బ్రిటిష్ వారికి ఎలా తెలిసిందో అర్థం కావడం లేదు. తండ్రి సైతం అజ్ఞాత వాసం వెళ్ళగా, ఆ ఇంట మిగిలింది అనసూయ ఒక్కతే, ఆమె ఉద్యమంలో అంతగా చురుకైన వ్యక్తి కాకపోవడం వలన ఆమెను బ్రిటీష్ దళం పట్టించుకోలేదు.

రెండు రోజుల అనంతరం ఓ ఆర్ధరాత్రి వచ్చిన భర్త భరద్వాజ్‌ను చూసి ఆశ్చర్యపోయింది అనసూయ.

ఏమిటి ఇంతకాలం ఎక్కడ వున్నావ్? మన వాళ్ళు ఎలా వున్నారు? అని అడిగేదేమీ లేదా?" ఏ విధమైన ప్రతిచర్య లేని అనసూయను అడిగాడు భరద్వాజ.

చిరునవ్వు నవ్వి ఊరుకుంది అనసూయ.

తెల్లవారు ఝామున మెలకువ వచ్చి చూస్తే ప్రక్కన భర్త లేడు. పాప గాఢ నిద్రలో ఉంది.

రెస్ట్ రూంకి వెళ్ళే సమయంలో లీలగా కొన్ని మాటలు వినబడి అటువైపు నడిచింది అనసూయ.

ఇంటి ముందు ఎవరితోనో మాట్లాడు తున్నాడు భరద్వాజ. అతడిని పరికించి చూస్తే బ్రిటీష్ వారి దూతగా వున్నాడు.

డోర్ పక్కనుంచి వారి మాటలను ఆలకించసాగింది అనసూయ.

"మధ్యాహ్నం మూడు గంటలకు రెడీగా వుండండి. ఉద్యమకారులు ఎక్కడ దాక్కున్నారో మీకు చూపిస్తాను. నన్ను సంతృప్తిపరచడం మరచిపోవద్దు అని దొర వారికి చెప్పండి.." చెపుతున్నాడు భరద్వాజ, ఆ దూతతో.

అతను వెళ్ళిపోయాక, నింపాదిగా లోపలకు వచ్చిన భరద్వాజ, అనసూయ ఉగ్రరూపం చూసి కొంత కలవర పడ్డాడు.

"నేను ఊహించిందే నిజమయిందన్నమాట!" కంపించి పోతోంది ఆమె.

"మన భవిష్యత్తు కోసం తప్పట్లేదు అనసూయా! మన కూతురు రాజ భోగ్యాలు అనుభవించాలి.. మీ నాన్నేమో ఉన్నదంతా ఊడ్చి ఆ ఉద్యమానికి తగలేశాడు. మన స్వార్థం మనం చూసుకోవాలి కదా!" నింపాదిగా చెప్పాడు.

అంతే.. అప్పటివరకు తన వెనుక దాచుకున్న గొడ్డలిని బయటకు తీసి భరద్వాజపై ఓ వేటు వేసింది.. "దేశద్రోహి....." అంటూ అనసూయ.

చెప్పేది ఆపి కొద్దిగా ఊపిరి తీసుకుంది ఆమె.

చాలా శ్రద్ధగా వింటున్నాడు సంజీవి.

"అమ్మను బ్రిటీష్ వారు అరెస్టు చేశారు. అరెస్టు కావడానికి ముందు పసి దానిని అయిన నన్ను ఒక బాలికల ఆశ్రమానికి ఒప్పచెప్పింది అమ్మ.

జైల్లో అమ్మను చిత్రహింసలు పెట్టారు. అన్నీ భరించింది. కానీ, ఎవరి గురించీ తెలుపలేదు. తాతయ్య ఏమయ్యాడో కూడా తెలియదు.

స్వాతంత్ర్యం వచ్చాక జైలు నుంచి బయటకు వచ్చిన అనసూయ వారసత్వంగా మిగిలిన ఆ బంగళాను స్వాతంత్ర్య సమరయోధుల స్మారకానికి ప్రభుత్వ పరం చేసింది.

స్వాతంత్ర్య సమరయోధుల పింఛనుకు దరఖాస్తు చేసుకోమని ఎమ్మెల్యే చాలా సార్లు చెప్పి చూసారు. అయితే, అమ్మ అందుకు ఒప్పుకోలేదు. దేశం కోసం పోరాడి, సర్వస్వం అర్పించాం. ప్రతిఫలం తనకు అక్కరలేదంది.

> **"అమ్మను బ్రిటీష్ వారు అరెస్టు చేశారు. అరెస్టు కావడానికి ముందు పసి దానిని అయిన నన్ను ఒక బాలికల ఆశ్రమానికి ఒప్పచెప్పింది అమ్మ. జైల్లో అమ్మను చిత్రహింసలు పెట్టారు. అన్నీ భరించింది. కానీ, ఎవరి గురించీ తెలుపలేదు. తాతయ్య ఏమయ్యాడో కూడా తెలియదు".**

ఈ సుదూర ప్రాంతానికి వచ్చి ఆ వేంకటేశ్వరస్వామి గుడిని ప్రతిరోజూ భక్తితో శుభ్రం చేసి, ఆ కోవెల ముంగిట పూలు అమ్ముతూ జీవనం సాగించేది నాతో. తన దగ్గర మిగిలిన కొద్దిపాటి సొమ్ముతో ఆ రోజుల్లో ఓ చిన్న గుడిసె అమ్మకానికి వస్తె కొన్నది. మరి నీడ ఉండాలిగా.. ఆమె వారసురాలిగా నేను ఆమె జ్ఞాపకాలతో నా ప్రస్థానం ఇలా.." ఆమె కళ్ళల్లో మెరుపు, తాతయ్య ప్రేమగా పెట్టిన పేరు స్వరాజ్యం. నా పేరును నేనే తలచుకుని మురిసిపోతుంటాను. ఆ అమ్మ బిడ్డగా గర్వపడుతున్నాను. ఇంతకు ముందు నీకు చెప్పింది అబద్ధం.. నేను అవివాహితను. పెళ్లి మీద ఇష్టం కలగలేదు. నా శేష జీవితం ఇలా గడిస్తే చాలనుకున్నాను. ఆ గుడిని చూస్తూ, ఇలా పూలు అమ్ముకుంటూ.. ఇక నాకు కోరికలు ఏమి ఉంటాయి.." స్వరాజ్యం ప్రతి మాటలో, ప్రతి పలుకులో అంతులేని తృప్తి జోగాడుతోంది.

తను ఎన్నో ఆర్టికల్స్ రాశాడు. ఏ ప్రతిఫలాపేక్ష లేకుండా దేశం కోసం త్యాగం చేసిన త్యాగధనులు ఉన్నారంటే తనకూ గర్వంగానే వుంది. నకిలీ సర్టిఫికెట్లతో స్వాతంత్ర సమరయోధుల పింఛను పొందినవారు ఎందరో వున్న ఈ దేశంలో ఇటువంటి నిస్వార్థపరులు ఉండటం చాలా గొప్పగా తలచి మనసులోనే జోహార్లు అర్పించాడు ఆ కుటుంబానికి. మరుసటి రోజే సంజీవి పనిచేసే ఆ ప్రముఖ పత్రిక బ్యానర్ ఐటమ్‌గా వెలువడిన ఆ విషయం ప్రజలను విపరీతంగా ఆకర్షించింది. స్వరాజ్యంను పలకరించడానికి జనం తండోప తండాలుగా తరలి రాసాగారు.. అయితే, అప్పటికే అక్కడ నుంచి మకాం మార్చిన స్వరాజ్యం ఎక్కడికి వెళ్లిందో ఎవరికీ తెలియదు. "పరామర్శలు, భుజకీర్తులు సహించలేకనే ఆమె వెళ్ళిపోయి వుండవచ్చు.." అని అనుకున్నాడు సంజీవి. ■

## జోక్స్

### బస్ స్టాప్‌లో సంభాషణ

"మిమ్మల్ని ఎక్కడో బాగా చూసినట్టు గుర్తు. కానీ ఎక్కడ చూసానో గుర్తు రావడం లేదు" అన్నాడు ఒక వ్యక్తి, పక్కనే నిలబడి వున్న స్త్రీతో.

"నాకు బాగా గుర్తుంది, నేను మెంటల్ హాస్పిటల్‌లో నర్సును" అంది పక్కనే వున్న స్త్రీ.

### నేను చూసుకుంటాను..

"ఒరే రమణా! బ్యాంక్ వీధి అమ్మాగారు ఎస్.ఎమ్.ఎస్.పంపారు. వాళ్లింట్లో రాత్రి కూర, అన్నం ఉండిపోయాయట, రమ్మన్నారు" అన్నాడు మొదటి యాచకుడు.

"ఈసారికి నువ్వెళ్లు, ఈ రోజంతా ఈ వీధి నేను చూసుకుంటాను" అన్నాడు రెండో యాచకుడు.

### పని చేయడం లేదు

"ఈ మధ్య ఒక్క సెలవు కూడా పెట్టకుండా డ్యూటీకి వస్తున్నావు, కారణమేంటో?" అన్నాడు కిషన్ కొలీగ్ వినయ్‌తో.



"మా ఇంట్లో ఏసీ పని చేయడం లేదురా" అన్నాడు కిషన్.

### మీ అబ్బాయికి వచ్చని..

అత్తగారు: "పెళ్లికి ముందు నీకు వంట వచ్చని ఎందుకు అబద్ధం చెప్పావు?" అంది కోడలితో.

కోడలు: "నువ్వు పెళ్లి చేసుకోబోయే అతనికి వంట బాగా వచ్చని పెళ్లిళ్ల పేరయ్య చెప్పాడు అందుకని".

### ఫైర్ స్టేషన్‌కు వెళ్లు..


"డాక్టర్‌గారూ, కడుపులో మంటగా ఉంది" అన్నాడు ఒక వ్యక్తి.

"అయితే నా దగ్గరకు ఎందుకు వచ్చావు? ఫైర్ స్టేషన్‌కు వెళ్లు" జవాబిచ్చాడు డాక్టర్.

### వంటలు రుచిగా లేవు

"ప్రతిరోజూ ఇక్కడికే వచ్చి అడుక్కుంటావు, ఎందుకని?" అంది గృహిణి.

"పక్క వీధిలో వాళ్లు చేసే వంటలు ఏమీ బాగుండవమ్మా" అన్నాడు యాచకుడు.



### బాయ్‌ఫ్రెండ్ లేని..

"స్వామిగారూ, మీ అబ్బాయికి ఎలాంటి అమ్మాయి కావాలో చెప్పండి" అన్నాడు పెళ్లిళ్ల పేరయ్య.

"మా అబ్బాయిని అడగండి" అన్నాడు స్వామి.

"బాబుగారూ! మీరు చెప్పండి, మీకు ఎలాంటి అమ్మాయి కావాలో"

"బాయ్‌ఫ్రెండ్ లేని అమ్మాయిని చూడండి" అన్నాడు కాబోయే పెళ్లికొడుకు రవి.

### .. ఆలోచిస్తున్నాను

"కుక్కబావా, నాకు మా యజమానికి పడటం లేదు ఏం చెయ్యాలో తెలియటం లేదు" అంది గాడిద.

"ఎక్కడికైనా వెళ్లిపోవచ్చు కదా" అంది కుక్క.

"మా యజమానికి ఒక కూతురు ఉంది. ఆమె సరిగ్గా చదవకపోతే గాడిదకిచ్చి పెళ్లి చేస్తానన్నాడు. అందుకని ఆలోచిస్తున్నాను" అంది గాడిద.

### తాళంచెవి అడిగాను

"నువ్వు ఎలా దొరికిపోయావు?" అడిగాడు మొదటి దొంగ.

"ఇంటివాళ్లని నిద్ర లేపి బీరువా తాళాలు ఎక్కడున్నాయి?" అని అడిగాను అన్నాడు రెండో దొంగ.




### తప్పంతా నాదే!

"ఈ మధ్య నువ్వు, మీ ఆవిడ గొడవ పడుతున్నట్లు లేదు. చాలా సంతోషంగా ఉందిరా" అన్నాడు స్నేహితుడు సుబ్బారావుతో, అప్పారావు.

"మా ఆవిడ తప్పు చేసినా, నేను తప్పు చేసినా తప్పు నా మీదే వేసుకుంటున్నాను" అన్నాడు సుబ్బారావు.

### జీతం ఇవ్వాల్సి వస్తుంది

భర్త: "మా అమ్మను మా తమ్ముడి దగ్గరకు పంపిస్తాను, మనకు కాస్త ఖర్చు తగ్గుతుంది" అన్నాడు భార్యతో.

భార్య: "అలా అయితే ఖర్చు ఇంకా పెరుగుతుంది. ఎలాగంటే మీ అమ్మను మరిది గారి ఇంటికి పంపిస్తే మనం పనిమనిషిని పెట్టుకుని జీతం ఇవ్వవలసి ఉంటుంది" అంది తాపీగా భార్య.

### కథ అచ్చయింది

సుబ్బారావు: "సన్యాసిరావు ఎలా చనిపోయాడురా?" అడిగాడు మిత్రుడు అప్పారావుని.

అప్పారావు: "వాడు రాసి పంపించిన కథ పత్రికలో అచ్చు అయి, కాంప్లిమెంటరీ కాపీ వచ్చిందట. దాంతో గుండాగి చనిపోయాడు" అన్నాడు అప్పారావు.

**- వైదా ఈశ్వరరావు,**
విశాఖపట్నం

### వశీకరణ

"వశీకరణం చేసి ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నావు కదా! ఇప్పుడెలా వుంది జీవితం?" గోపాలాన్ని అడిగాడు శంకరం.

"ఆమెను ఎలా వదిలించుకోవాలో తెలియటం లేదురా!" అన్నాడు గోపాలం విచారంగా.

**- టి.సదాశివరెడ్డి,**
తిరుపతి

# పిల్లల్లో ప్రశ్నించే నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తున్నామా?

డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి



**పిల్లలు** తాము చూసిన ప్రతి అంశం గురించి తెలుసుకో వాలనే ఉత్సుకతతో తల్లితండ్రులు, కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, ఉపాధ్యాయులను ఎందుకు, ఏమిటి, ఎలా, ఎక్కడ అంటూ ప్రశ్నల వర్షంలో ముంచేస్తారు. ఆకులు పచ్చగానే ఎందుకు ఉన్నాయి? పసుపును, సున్నాన్ని కలిపితే ఎర్రని ద్రవం ఎందుకు వచ్చింది? దెబ్బ తగిలి రక్తం కారినపుడు అమ్మ పసుపు పూసి గుడ్డతో ఎందుకు కడుతుంది? ఇలాంటి నిత్య సత్యాలను చూస్తూ, చూసిన ప్రతి విషయం గూర్చి తెలుసుకోవాలనే తపనతో పిల్లలు ప్రశ్నలు అడుగుతూ ఉంటారు. పెద్దలకు కూడా ఇలాంటి ప్రశ్నలు రావడం వల్లనే అద్భుత ఆవిష్కరణలు ఆవిష్కరించబడ్డాయి. నిజానికి ప్రకృతిని నిరంతరం ప్రశ్నించడమే నిన్నటి వైజ్ఞానిక శాస్త్రానికి, నాటి ఏఐ విప్లవానికి పునాదిగా నిలుస్తున్నది, రేపటికి శాస్త్ర సాంకేతిక శాస్త్ర విస్తృతికి ఏకైక ఆధారంగా ప్రశ్నించడమనే కళ నిలుస్తుంది కూడా. ఆపిల్ చెట్టుపై నుంచి కిందికే ఎందుకు పడింది? అని న్యూటన్ ప్రశ్న. నీటికి రంగు లేనప్పటికీ సముద్రజలం, ఆకాశం నీలి రంగులో ఎందుకు ఉన్నాయి? అనే ప్రశ్న సర్.సి.వి.రామన్‌కు రావడం వల్లనే కదా గొప్ప వైజ్ఞానిక శాస్త్ర ఆవిష్కరణకు దారి తీసాయని మనకు తెలుసు. నిజానికి ప్రశ్నించే తత్వమే సృజనకు, ఆవిష్కరణలకు, వైజ్ఞానిక, టెక్నాలజీ విషయ పరిజ్ఞాన విస్తృతికి పునాది అని తెలుసుకోవాలి.

## పిల్లల్లో ప్రశ్నించే తత్వం ప్రయోజనాలు

ప్రశ్నించడమే తెలుసుకోవాలనే తపనను సూచిస్తుంది. ప్రశ్నించడం అనే పునాది మీదనే శాస్త్ర సాంకేతిక అభివృద్ధికి మూలం. పిల్లలు ప్రశ్నలు అడిగితే విసుక్కోవడం, సమాధానం చెప్పకపోవడంతో వారిలో తెలుసుకోవాలనే జిజ్ఞాసను ఆదిలోనే తుంచేస్తున్నామని, అదే పిల్లలు ప్రశ్నించడం మానేస్తే అజ్ఞానాన్ని మోస్తూ కాలం గడుపుతారు. నిజానికి నేటి సమాజంలో ప్రశ్నించేవారిని అవిధేయులని, విప్లవకారులని, విసిగించేవారని ముద్ర వేస్తున్నది. పిల్లలు అడిగే ప్రతి అర్థవంతమైన ప్రశ్నకు నిదానంగా, ఓపికగా సమాధానాలు చెప్పడం ఇంట్లో తల్లితండ్రుల నుంచే మొదలు కావాలి. అమ్మానాన్నలు తమ పనుల్లో పడి పిల్లలు ప్రశ్నలు అడిగితే వెంటనే విసుక్కోవడం తరుచుగా జరుగుతున్నది. సమాధానం తెలిస్తే వెంటనే చెప్పండి. తెలియకపోతే తెలుసుకొని సరైన సమాధానం చెప్పండి. అడిగి ప్రతి అర్థవంతమైన ప్రశ్నకు బహుమతి ఇవ్వండి. తెలియకపోతే వెంటనే ప్రశ్నలు అడిగేలా సిద్ధం చేయడం. తెలియని విషయాన్ని ఇతరుల నుండి సమాధానాలు పొందితే దినదినం విజ్ఞానం పెరుగుతుంది. ప్రశ్నించడం మానేస్తే అజ్ఞాన చీకట్లు జీవితాంతం మనతోనే వస్తాయి. నిజానికి ప్రశ్నించే నైపుణ్యం పిల్లల్లో ఉన్నట్లయితే ఆ చిన్నారుల్లో అభిజ్ఞ అభివృద్ధి (కాగ్నిటివ్ డెవలప్‌మెంట్), క్రిటికల్ థింకింగ్, నేర్చుకోవాలనే తపన పెరగడం (క్యూరియాసిటీ), విజ్ఞాన సముపార్జనకు రహదారులు పడడం, కమ్యూనికేషన్ స్కిల్స్ పెరగడం, పనిలో సంతృప్తి కలగడం, విజ్ఞాన విస్తృతులు పెరగడం, మెదడు పదునెక్కడం, ప్రకృతిని అర్థం చేసుకోవడం, ఆత్మవిశ్వాసం పెరగడం, లోతైన విషయ అవగాహన కలగడం, సమస్యలకు సమాధానాలను వెదికే గుణం పెరగడం లాంటి అనేక ప్రయోజనాలను కలిగిస్తుంది.

## 21వ శతాబ్దపు తరగతి గది ఎలా ఉండాలి!

ప్రశ్నించే నైపుణ్యం అంటే తరగతి గదిలో సరైన సమయంలో సరైన ప్రశ్నలు అడిగే సామర్థ్యం అని తెలుసు కోవాలి. పిల్లలు ప్రశ్నించే విధంగా బోధనలు కొనసాగించడమే ఉత్తమ ఉపాధ్యాయుడి అసలైన సామర్థ్యం. బలమైన విద్యా పునాదిని నిర్మించడానికి ప్రశ్నించే నైపుణ్యం చాలా ప్రధానం. 21వ శతాబ్దపు తరగతి గదులు వాస్తవ ప్రపంచంలో జరిగే ప్రశ్నల గురించి నిండిపోవాలి. రేపటి తరగతి గది సృజనాత్మకంగా నేర్చుకునే విధానంపై దృష్టి సారించాలి. 21వ శతాబ్దపు తరగతి గది సహకార సమస్యలకు పరిష్కారాలు, సృజనాత్మక, సాంస్కృతిక సామర్థ్యాలు, ప్రతిభావంతమైన రాత, మౌఖిక సంభాషణలు, నైతిక నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాలు, అన్వేషణాత్మక సంభాషణలు, నాయకత్వ లక్షణాల కూర్పు, విమర్శనాత్మక ఆలోచనలు, వ్యక్తిగత చొరవకు చిరునామాలుగా మారాలి.

## తరగతి గది ప్రశ్నల నిధి

కంటెంట్‌ను ఆలకింపు చేసుకోవడం, దాని పట్ల లోతైన అవగాహనను కలిగించడం ప్రశ్నించే నైపుణ్యాన్ని పెంచే తరగతి గదులను కార్యశాలలు/ప్రయోగశాలలుగా తయారు చేద్దాం. నిన్నటి సుద్దముక్క, బ్లాక్ బోర్డు విధానం నెమ్మదిగా పలుచబడుతున్నది. అభ్యాసకులు ప్రశ్నించే పద్ధతితో జ్ఞాన ఆధారిత సమాధానాలు, సానుకూల అభ్యాసం పెరుగుతోంది. నేటి పిల్లలు, యువతను జీవితకాలం పాటు ప్రశించే గొంతులుగా, విజ్ఞాన సమాధానాలు పొందే విధానాలను పాటించాలి. బోధించిన ప్రతి పాఠాన్ని ప్రయోగాత్మకంగా రుజువు చేసుకోగలగాలి.

తరగతి గది ప్రశ్నల నిధి కావాలి. చిన్నతనంలో పిల్లలు అడిగే ప్రశ్నలకు తల్లితండ్రులు ప్రేమగా సమాధానాలు ఇవ్వాలి. నవజాత శిశువు సహితం ఏడుపు అనే ప్రశ్నతో అమ్మ రొమ్ముపాలను సమాధానంగా పొందుతాడు. ■

# భక్తి ఎల్లలు

యామిజాల జగదీశ్

"నీకోసం నేను ఏం చెయ్యడానికైనా సిద్ధమే" అని అన్నాడొక వ్యక్తి. "సరే. నాకేమీ అక్కర్లేదు కానీ ఓ ఇప్పుడు అయిదు వందలు ఇవ్వు చాలు. రేపు తిరిగి ఇచ్చేస్తాను" అన్నాను నేను.

"అయ్యో చెప్పడం మరిచాను... నేను అర్జంటుగా ఓ మనిషిని కలవాల్సి ఉంది. మళ్ళీ కలుస్తాను" అని వెళ్ళిన ఆ మనిషి ఇప్పటి వరకూ కలవలేదు మళ్ళీ నన్ను. కనీసం ఎలా ఉన్నావని ఫోన్ కూడా చేయలేదు.

ఈ రోజుల్లో పరిస్థితి ఇది. అయితే నిజంగానే ఒకరి పట్ల నిజమైన ప్రేమ, అభిమానం చూపడం అనేది చాలా గొప్ప విషయం. భక్తితో ఉండటం అనేది వాటి కన్నా ఉన్నతమైన విషయం. భక్తి అంటే ఏదో ఆలయానికి వెళ్ళి దేవుడికి దణ్ణం పెట్టుకుని రావడం కాదు. భక్తి ఎల్లలు ఏమిటో తెలుసుకోవాలని ఉందా? అలాగైతే ఈ విషయం చదవండి.

మయూరశర్మ అని ఒకడుండేవాడు. అతనికి కృష్ణుడంటే మహా భక్తి. ఒకరోజు కృష్ణుడు అతనిని ఓమారు చూసి వెళ్దామని వచ్చాడు. కృష్ణుడిని చూడగానే అతనికి అంతులేని ఆనందం ఉండదా మరి! మామూలుగా అయితే భక్తులే కదా భగవంతుడిని ఏదైనా అడుగుతారు.



ఇక్కడ భగవంతుడే భక్తుడిని చూసి అడిగారు...

"ఇదిగో చూడు నాయనా...నిన్ను నేనొకటి అడుగుతాను. ఇస్తావా మరి?" అని అడిగాడు.

భక్తుడు కాదంటాడా. లేదంటాడా? ఇస్తానంటాడుగా! "మీరు ఏదడిగినా ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నాను" అన్నాడు మయూరశర్మ.

"నీకో కొడుకు ఉన్నాడు కదా..! అయిదేళ్ల వయస్సున్న ఆ కుర్రాడు నాకు కావాలి" అన్నాడు భగవంతుడు.

అయితే మయూరశర్మ ఆ మాటకు ఏ మాత్రం కలవరపడలేదు. తడబడలేదు. "సరే ఇస్తున్నాను తీసుకో" అన్నాడు. కృష్ణుడు "అతని శరీరమంతా నాకక్కర్లేదు. అతని దేహంలో వున్న కుడివైపు మాత్రమే కావాలి" అన్నాడు కృష్ణుడు.

దానికి కూడా మయూరశర్మ సరేనన్నాడు.

"ఆ చిన్నబ్బాయిని నిలబెట్టి అతని తల మీద నుంచి సగానికి రంపంతో కోయాలి. అప్పుడే అతను రెండు ముక్కలవుతాడు. అప్పుడు ఆ కుడి వైపు భాగాన్ని నేను తీసుకుంటాను" అన్నాడు కృష్ణుడు. దానికి కూడా మయూరశర్మ సరేనన్నాడు. ఏ మాత్రం భయపడలేదు.

అంతట కృష్ణుడు "రంపాన్ని నువ్వో వైపు, నీ భార్య మరోవైపు పట్టుకుని కోయాలి రెండు ముక్కలుగా" అని చెప్పాడు కృష్ణుడు. "అలా చేస్తున్నప్పుడు నువ్వు కానీ నీ భార్య కానీ ఏడవకూడదు" అని చెప్పాడు కృష్ణుడు.

"నీ కొడుకు కూడా ఏడవకూడదు సరేనా!" అన్నాడు కృష్ణుడు. ఆ షరతులకు కూడా మయూరశర్మ సరేనన్నాడు. "అయితే మీరిద్దరూ మీ అబ్బాయిని రెండు ముక్కలు చేసిన తర్వాతే నేను వాడి కుడి భాగాన్ని తీసుకుంటానన్నాడు" కృష్ణుడు.

అప్పుడు మయూరశర్మ "మీరు విధించిన నిబంధనలన్నింటికీ మేం సిద్ధమేనండి" అన్నాడు.

మయూరశర్మ వెంటనే తన కుమారుడిని పిలిచాడు.

అతను వచ్చి నిల్చున్నాడు. కొడుకుకు స్నానం చేయించాడు. కొత్త బట్టలు వేసాడు. అనంతరం ఓ రంపం తీసుకున్నాడు. భార్యతో కలిసి కొడుకుని రెండు ముక్కలుగా నరకడం మొదలుపెట్టాడు మయూరశర్మ. భార్యాభర్తల కళ్లమ్మట చుక్క నీరు కూడా రాలేదు. అయితే ఆ చిన్నబ్బాయి ఎడమ కంటి నుంచి కన్నీరొచ్చింది. అది కృష్ణుడు చూసాడు. "నా నిబంధన మేరకు మీరు ప్రవర్తించలేదు. కనుక నీ అబ్బాయి కుడి భాగం నాకక్కర్లేదు" అన్నాడు కృష్ణుడు.

"మేమిద్దరం ఏడవలేదు కదా!" అన్నాడు మయూరశర్మ.

"మీరు ఏడవలేదు నిజమే. కానీ మీ అబ్బాయి ఎడమ కంట్లోంచి నీరు కారుతోంది చూడండి..!" అన్నాడు కృష్ణుడు.

ఆ మాట విన్న కుర్రాడు ఏం చెప్పాడో తెలుసా...

"నా కుడి భాగం మాత్రమే మీకు కావాలి అన్నారు. కుడి భాగం చేసుకున్న పుణ్యం నేను చేసుకోలేదు కదా! అనే ఎడవ భాగం ఏడుస్తోంది. అంతే తప్ప మీరు నా కుడి భాగాన్ని తీసుకోబోతున్నందుకు నేను ఏడవలేదన్నాడు".

ఆ మాటతో కృష్ణుడు కళ్ల చెమ్మగిల్లాయి. ఆ కుర్రాడిని మనసారా హత్తుకున్నాడు. ఇంకేముంది? అతను మళ్ళీ యథాస్థితికొచ్చేసాడు.

భక్తి ఎల్లలు అర్థం చేసుకోవడానికే ఈ కథ చెప్పిన ప్రవచనకర్త తన మాట కొనసాగించాడు. దేవుడెప్పుడైనా వచ్చి ఓ కుర్రాడిని రెండు ముక్కలు కోస్తే అందులో సగ భాగం తీసుకుపోతానని చెప్తాడా? అదంతా జరిగే పనేనా? అని ఆలోచిస్తూ కూర్చోకండి. ఆధ్యాత్మిక విషయాలను ఆధ్యాత్మిక పంథాలోనే అర్థం చేసుకోవాలి. భక్తి ఎల్లల వరకూ మనం వెళ్లకపోయినా కొద్ది దూరం వరకైనా వెళ్ళడానికి ప్రయత్నించాలి.

...........

ఇప్పటి భక్తి విషయానికొద్దాం... ఒకడు దేవుడిని వేడుకుంటున్నాడు. నేను చేసే వ్యాపారంలో "నాకీరోజు వెయ్యి రూపాయలు లాభం వస్తే అందులో అయిదు వందలు నీ ఆలయంలోని హుండీలో వేస్తాను" అని చెప్పాడు. అయితే ఆ రోజు వ్యాపారంలో వెయ్యి రూపాయల లాభం రాలేదు. అయిదు వందల రూపాయల లాభం దక్కింది. దాంతో అతను గుడికే వెళ్లలేదు. "అదేమిటీ! అయిదు వందల రూపాయల లాభం లభించింది కదా అందులో సగం హుండీలో వేయవచ్చు కదా" అన్నాను నేను. నా మాట విన్న ఆతను నా వంక కోపంగా చూశాడు "మీరు అర్థమయ్యే మాట్లాడుతున్నారా? దేవుడు అంతకుముందే తన వాటాగా అయిదు వందల రూపాయలు తీసుకుని నాకు మిగిలిన అయిదు వందలూ ఇచ్చేసాడు. కనుక నేను అతనికి ఇవ్వవలసిన పని లేదు" అని చెప్పాడతను.

దీనిని బట్టి అతని భక్తి ఎల్లలు ఏ మేరకు ఉందో చూడండి.

# గృహ ప్రవేశ నియమాలు?


వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్: 9885446501/9885449458




– వాసుదేవరావు, గుంటూరు

ప్రశ్న: ఆదివారం గృహప్రవేశం చేయవచ్చాణ? ఒక్కొక్కరు ఒక్కో రకంగా చెప్తున్నారు. గృహ ప్రవేశం నియమాలు ఏమైనా ఉన్నాయా? గృహ ప్రవేశానికి వార పరంగా ఎలాంటి నియమాలు ఉన్నాయి?

జవాబు: గృహ ప్రవేశానికి అనేక నియమాలున్నాయి. సాధారణంగా చంద్రుడు బలంగా ఉన్నప్పుడు పంచాంగ నియమాలకు అనుగుణంగా ముహూర్తం నిర్ధారింపబడుతుంది. గృహ ప్రవేశానికి వార పరంగా ఆదివారం, మంగళవారం, శనివారం విసర్జింపబడతాయి. సోమవారం, బుధవారం, గురువారం, శుక్రవారం అమోదింపబడతాయి,

**ఫలాఫలాలు:**

ఆదివారం – అతి దుఃఖము
సోమవారం – (క్షీణ చంద్రుడు) – కలహం
(వృద్ధి చంద్రుడు)– సౌఖ్యము
(పూర్ణ చంద్రుడు)– సంపద
మంగళవారం – అగ్నిభయం
బుధవారం – ధాన్యవృద్ధి
గురువారం – పశు, పుత్ర వృద్ధి
శుక్రవారం – లాభం
శనివారం – చోర భయం

గృహ నక్షత్రానికి, గృహ యాజమాని జన్మ నక్షత్రానికి ఎంత అనుకూల సమయం అయినప్పటికీ, ముహూర్తంలో వారం కూడా ఎంతో ప్రధానమిది.

## స్కూలు క్లిష్ట పరిస్థితులలో..

**ప్రశ్న: మా పాఠశాల 1991 సం॥లో ప్రారంభించబడినది. 2002లో స్వంత భవనంలోకి మార్చాం. 2006 వరకు విద్యార్థుల సంఖ్య బాగా ఉన్నది. 2007 నుండి క్రమంగా తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం చాలా క్లిష్ట పరిస్థితులలో ఉన్నది. పాఠశాల భవనంలో గాయిత్రీ హోమం, గణపతి పూజ నిర్వహించాం. అయినా పరిస్థితులలో మార్పు కనిపించలేదు. స్కూలు పరిస్థితి బాగు పడాలంటే ఏం చేయాలో వివరించగలరు.**



జవాబు: కొంత కాలం బాగా అభివృద్ధి చెంది ఆ తరువాత కుంటుబడిన అనేక విద్యాలయాలు, ఆఫీసులు, వ్యాపారాలకు సంబంధించి అనేక విధాల వాస్తు దోషాలు కారణమయ్యే అవకాశం ఉంటుంది. అవేమిటో తెలుసుకొని సరిదిద్దిన తర్వాత తిరిగి పురోగతిని సాధించిన సందర్భాలు కూడా అనేకం ఉన్నాయి. ఇటువంటప్పుడు స్థలాన్ని చూపించి సరిదిద్దుకుంటే మంచిది. ఉత్తర ఈశాన్యంలో వీధి ఉన్న తీరు గేటు అనుకూల ఫలితాలనిచ్చే విధంగా ఉన్నాయి. మొత్తం స్థలానికి నైరుతి మూలను మూలమట్టానికి సరిజేయటం మీ ప్రథమ కర్తవ్యం.

## వీధిపోటు వర్తిస్తుందా?

– కమలాకర్, నంద్యాల

**ప్రశ్న: తూర్పు రోడ్డు నుండి నుండి పడమర వైపు మా స్థలానికి మా పక్కవారి ఇంటికి మాత్రమే దారి ఉన్నది. ఆ దారి 15 ఫీట్ల వెడల్పుతో ఉన్నది. అయితే ఆ దారి మా స్థలానికి ఎదురుగా ఉండటం వలన మేం గృహం నిర్మిస్తే 'వీధిపోటు తగులుతుంది' అని అంటున్నారు. అసలు ఆ స్థలానికి 'వీధిపోటు వర్తిస్తుందా? లేదా? ఒకవేళ వర్తిస్తే మేం ఆ దారిని పూర్తిగా మూసివేసి పడమర వైపు గల దారి వాడుకోవచ్చా?**

జవాబు: ఆ దారిని పూర్తిగా మూసివేసినప్పటికీ మీ స్థలానికి తూర్పు ఆగ్నేయ వీధిపోటు ప్రభావం (ప్రతికూలం) తప్పకుండా ఉంటుంది. అందుకని ఆ 15 ఫీట్ల వీధిని పూర్తిగా పడమర వరకు వదిలేయండి. అప్పుడు మీ స్థలానికి పడమర ప్రధాన ద్వారంతో గృహ నిర్మాణం గావించండి. తూర్పు ఆగ్నేయ వీధి పోటు తప్పుతుంది. తద్వారా మంచి ఫలితాలు పొందవచ్చు.

## నిత్యపూజ, దీపారాధన ఉండవు

– పావని, నెల్లూరు

**ప్రశ్న: రెండంతస్తుల మా ఇంటికి ఉత్తర ఈశాన్యంలో/తూర్పు ఈశాన్యంలో మా ఇంటిని కలిపి కట్టిన నిర్మాణం ఉన్నది. దానిలో వినాయక చవితి సమయంలో నవరాత్రులు జరుగుతాయి. నిత్యపూజ, దీపారాధన ఉండవు. దీనివలన మాకు వాస్తు పరంగా ఏమైనా సమస్యలు ఉంటుందా?**

జవాబు: ఇంటికి ఈశాన్య దిశలో ప్రహరీ గోడకు ఆనుకొని లోపలి వైపుగానీ, బయటి(వీధి)వైపుగానీ 'ఏ విధమైన' నిర్మాణం ఉండకూడదు. ఇది వాస్తుపరంగా దోషమే అవుతుంది. ఆ నిర్మాణంలో విగ్రహం కానీ, పటాలుగానీ ఉన్నాయో లేదో తెలుపలేదు. విగ్రహం ఉంటే నియమానుసారం 'ఉద్వాసన' చేయించి ఆ కట్టడాన్ని నిర్మూలించవచ్చు. ఒకవేళ ఈ పని చేయటం అక్కడున్న పరిస్థితుల వల్లగానీ, ఆచార వ్యవహారాల వల్లగానీ వీలుగాకపోతే వ్యక్తిగతం సంప్రదించండి.

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ........................................
పుట్టిన తేది : ........................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ............
చిరునామా:..........................................

# పావనం పట్టాభిరాముని దర్శనం

ఇలపావులూరి వెంకటేశ్వర్లు

**మన దేశం దేవ భూమి. పురాణాల ఆధారంగా స్వయంగా సర్వాంతర్యామి నడయాడిన దివ్య భూమి. మహర్షులు, గురువులు, కవులు దేవదేవుని లీలలను కీర్తిస్తూ ఎన్నో కావ్యాలు, కీర్తనలు రచించారు.**

అక్షరాస్యత తక్కువగా ఉన్నప్పటికీ విని, వల్లె వేయడం వలన ఒక తరం నుండి మరో తరానికి వారసత్వంగా కొనసాగుతూ ప్రజలలో ఆదిదేవుని పట్ల భక్తి విశ్వాసాలు స్థిరంగా ఉండిపోయాయి. పాలకులు కూడా ప్రజలలో నిరాకారుని పట్ల నెలకొని ఉన్న ఆరాధనను గమనించి ఊరూరా ఆలయాలను నిర్మించారు. వారి ఆదరణలో ఉన్న కవిపండితులు కూడా పరమేశ్వరుని కీర్తిస్తూ కావ్యాలను రచించారు. పాలకుల వద్ద మంత్రులుగా, సేనాధిపతులుగా, దండనాయకులుగా, ఒక ప్రాంతానికి అధిపతులుగా ఉన్నవారు కూడా అనేక ఆలయాలను నిర్మించడం లేదా శిథిలావస్థలో ఉన్న ఆలయాలను పునః నిర్మించడం జరిగినట్లుగా శాసనాలు, స్థానిక కథనాల వల్ల తెలుస్తోంది.



ఇలా నిర్మించబడిన ఆలయాలు దేశం నలుమూలలా కనిపిస్తాయి. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాలలో అనేకం కనిపిస్తాయి. అవన్నీ కూడా సుమారు క్రీస్తుశకం పదవ శతాబ్ద కాలానికి ముందే నిర్మించినట్లుగా శాసనాలు తెలియచేస్తున్నాయి. ఆ పురాతన దేవాలయాల విశేషాలు ప్రజలకు తెలియచేయవలసిన అవసరం, తెలుసుకొన్న భక్తులు సందర్శించవలసిన అవసరం కూడా ఎంతో ఉన్నది.

### అష్టదిగ్గజాలు

అష్టదిగ్గజాలు విజయనగర పాలకులు కవిపండిత పక్షపాతులు. వారిని ఆదరించేవారు, సత్కరించేవారు. ప్రతిరోజూ కవితాగోష్టులు నిర్వహించేవారు అని చెబుతారు. మన పురాణాల ప్రకారం పృథ్వికి ఉన్న అష్టదిక్కులను ఎనిమిది ఏనుగులు కాపలా కాస్తుంటాయని తెలుస్తోంది. ఆ అష్ట గజాల పేర్లు ఐరావతం, పుండరీకం, వామనం, కుముదం, అంజనం, పుష్పదంతం, సార్వభౌమం, సుప్రతీకం.

విజయనగర రాజులలో అగ్రగణ్యుడు అయిన శ్రీకృష్ణదేవ రాయలు స్వయంగా కవి. అముక్త మాల్యద లాంటి కావ్యాన్ని రచించారు. ఎందరో కవి పండితులను ఆదరించారు. ఎన్నో కావ్యాలను స్వీకరించారు. శ్రీకృష్ణ దేవరాయల కొలువులో ఉన్న భువన విజయంలో ఎనిమిది మంది గొప్ప కవి పండితులు ఉండేవారు. అనేక కవిసమ్మేళనాలలో, పాండిత్య సభలలో పాల్గొని విజయం సాధించిన వారిని 'అష్టదిగ్గజాలు'గా పిలిచేవారు. భువన విజయ గౌరవాన్ని కాపాడేవారిగా వారిని అలా పిలిచేవారు. వీరి పేర్ల గురించి కొంత సందేహం ఉన్నప్పటికీ అందరూ అంగీకరించిన ఆ ఎనిమిది మంది కవిదిగ్గజాల పేర్లు వరుసగా అల్లసాని పెద్దన, ధూర్జటి, నంది తిమ్మన, మాదయ్యగారి మల్లన, అయ్యలరాజు రామభద్రుడు, రామరాజభూషణుడు, పింగళి సూరన, తెనాలి రామకృష్ణ. వారందరూ ఎన్నో ప్రబంధ కావ్యాలను రచించారని చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది.

### తెనాలి రామకృష్ణ

వికటకవిగా ప్రసిద్ధి గాంచిన తెనాలి రామకృష్ణ స్వస్థలం కృష్ణాతీరం. వీరి ఇంటి పేరు "గార్లపాటి". కానీ చిన్నతనం నుండి తెనాలిలో మేనమామ గారి ఇంట పెరగడం వలన "తెనాలి రామకృష్ణ"గా పిలవబడ్డారు.

అమ్మలగన్నయమ్మ శ్రీ దుర్గాదేవి అనుగ్రహంతో గొప్ప కవి, హాస్యప్రియుడు, తన చతురోక్తులతో ఇతరులను మైమరపించి అలరించేవానిగా పేరొందారు. తన సునిశిత వ్యంగ్య హాస్య కవిత్వంతో ఎంతటి వారి గర్వాన్ని, అహంకారాన్ని అణచి విజయం సాధించేవారు. శ్రీకృష్ణదేవరాయల వారికి కూడా రామకృష్ణుని పట్ల ఎనలేని గౌరవం ఉండేది. తెనాలి రామకృష్ణుడు గొప్ప దేశభక్తునిగా, రాజుగారి విశ్వాసపాత్రునిగా గుర్తింపు పొందారు అని ప్రచారంలో ఉన్న అనేక గాథల ద్వారా అర్థం అవుతుంది.

తెనాలి రామకృషుని గాథలు మన తెలుగు రాష్ట్రాలలోనే కాదు దేశమంతా గుర్తింపు పొందాయి. కవి, దేశభక్తుడు, రాజుగారికి విశ్వాస పాత్రునిగానే కాకుండా గొప్ప హిందూవాదిగా, సర్వేశ్వరుని పట్ల అంతులేని భక్తివిశ్వాసాలు కలిగినవారుగా పేరొందారు. వీరి స్వగ్రామం అయిన గార్లపాడు నేటి సత్తెనపల్లి (పల్నాడు జిల్లా)కి సమీపంలోని "లక్కరాజు గార్లపాడు" గా గుర్తించారు. శ్రీ రామకృష్ణుని తాత తండ్రులు గ్రామంలోని బొడ్డురాయి వద్ద ఉండే ఇంట్లో నివసించేవారని తెలుస్తోంది. తండ్రి శ్రీ రామయ్య మరణానంతరం రామకృష్ణుడు మేనమామ గారి గ్రామమైన తెనాలిలో నివసించారు. అతడు ఆ పేరుతోనే ప్రసిద్ధి చెందారు.

దక్షిణ భారతదేశంలో అనేక విశిష్ట దేవాలయాలను నిర్మించిన శ్రీ కృష్ణ దేవరాయలవారి అడుగు జాడలలో నడిచారని తెలుస్తుంది ఆయన స్వగ్రామం వెళితే.

## శ్రీ పట్టాభిరామ ఆలయం

సుమారు రెండు వేల సంవత్సరాల కిందటి ప్రతిష్ఠిత శ్రీ పట్టాభిరాముని ఆలయం లక్కరాజు గార్లపాడులో ఉన్నది. ఈ ఆలయాన్ని తెనాలి రామకృష్ణ కవి పునఃనిర్మాణం చేయించినట్లుగా ప్రాంగణంలోని శాసనం ద్వారా తెలుస్తోంది. ఈ శాసనంలో రామకృష్ణుని తాత తండ్రుల పేర్లు ఉన్నాయి. అనంతర కాలంలో పరాయి పాలకుల దాడుల నుండి ఆలయాలలోని మూలవిరాట్టులను కాపాడే సమయంలో భూమిలో ఎక్కడో దాచేసారట. సుమారు రెండు వందల సంవత్సరాల పాటు ఆలయం మూలవిరాట్టు లేకుండా ఉండిదట.

అదే సమయంలో ఈ ప్రాంతంలో తీవ్రమైన నీటి ఎద్దడి ఏర్పడినదట. ప్రజలు అనేక ప్రాంతాలలో తాగు నీటి కోసం బావులను తవ్వసాగారట. ఆ తవ్వకాలలో శ్రీ పట్టాభిరాముని, శ్రీ ఆంజనేయస్వామి వారి విగ్రహాలు బయల్పడ్డాయి. తాగు నీరు కూడా లభ్యమైనది అని చెప్పవలసిన అవసరం లేదు.

అలా తిరిగి దర్శనమిచ్చిన శ్రీ పట్టాభిరామునికి, శ్రీ వాయునందనుని తిరిగి ప్రతిష్ఠించారు. అప్పటి ఈ ప్రాంత పాలకుడు శ్రీ రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు గారు ఆలయాన్ని పునర్నిర్మించినట్లుగా వారి వేసిన శాసన ప్రతి ద్వారా తెలుస్తోంది.

ఇది చాలా చిన్న ఆలయం. పడమర ముఖంగా ఉండే ఈ ఆలయానికి ఎలాంటి రాజగోపురం కానీ విశేష నిర్మాణాలు కానీ కనిపించవు. ఆలయ ఆగ్నేయ దిశలో కళ్యాణ మండపం ఉంటుంది. కొన్ని భిన్న శిల్పాలు, రూపాలు ప్రాంగణంలో కనిపిస్తాయి. ఎత్తైన ధ్వజస్థంభం ఆలయానికి ఎదురుగా ఉంటుంది. ఇక్కడే శ్రీ రామకృష్ణ కవి వేయించినదిగా చెప్పబడే శాసనం కూడా ఉంటుంది. చాలా చిన్న ముఖ, అర్ధ మండపం ఉంటాయి. కానీ అవి జీర్ణావస్థలో ఉండటం శోచనీయం. శ్రీ అంజనాతనయుడు ముఖ మండపంలో ఉత్తరాభిముఖుడై దర్శనమిస్తారు.

## శ్రీ పట్టాభిరామ స్వామి

ఆలయం ఎంత చిన్నగా, శిథిలావస్థకు దగ్గరగా ఉన్నదో లోపల మూలవిరాట్టు వాటికి భిన్నంగా అరుదైన రూపంలో రమణీయ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. స్వామివారిని చూడగానే ఆలయ విషయాలేవీ గుర్తుకు రావు. స్వామివారే కనిపిస్తారు. ఎందుకంటే అలాంటి విగ్రహం ప్రపంచంలో మరెక్కడా లేదంటే అతిశయోక్తి లేదు.



సహజంగా ఏ రామాలయంలో చూసినా శ్రీ సీతా లక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీ రామచంద్రమూర్తి దర్శనమిస్తారు. ధ్వజస్థంభం దగ్గర వినతాసుతుడు గరుత్మంతుడు కొలువై ఉంటారు. శ్రీ మహావిష్ణువు ధరించిన దశావతారాలలో ఏ అవతార ఆలయంలోనూ శ్రీవారు దేవేరితో పాటు ఇతర కుటుంబ సభ్యులతో కలిసి కొలువైన ఆలయం ఒక్కటే ఉన్నది.

చెన్నై నగరంలో ఉన్న శ్రీ పార్థసారధి స్వామి ఆలయంలో శ్రీ వెంకట కృష్ణస్వామి భార్య, సోదరులు, కుమారుడు, మనుమడు శ్రీ రుక్మిణి, శ్రీ బలదేవ, శ్రీ సాత్యకి, శ్రీ ప్రద్యుమ్న, శ్రీ అనిరుద్ధునితో కలిసి దర్శనమిస్తారు. ట్రిప్లికేన్‌లో ఉన్న ఈ ఆలయంలో గర్భాలయంలో మొత్తం అయిదు విగ్రహాలు కనిపిస్తాయి. కానీ లక్కరాజు గార్లపాడులోని మూలవిరాట్టు ఒక ప్రత్యేకత. అరుదైన విశేషం. భక్తిపారవశ్యం కలిగించే రూపం, ఆనందపరవశం తెలియకుండానే ఉప్పొంగే విగ్రహం.

ఇన్ని విశ్లేషణలు ఉపయోగించడానికి కారణం మూలవిరాట్టులో మరెక్కడా కనిపించని ప్రత్యేకతే కారణం! భక్తులు స్వామివార వంక అలాగే చూస్తూ ఉండిపోతారు. ఒకే విగ్రహంలో దశరథ నందనులు నలుగురు, జనకరాజ పుత్రి, శ్రీ మారుతీనందనుడు, శ్రీ వినతాసుతుడు ఛత్రం, చామరంతో సహా చక్రవర్తి వైభవాన్ని చాటి చెప్పే కిరీటాలు, నగలు ధరించి కనిపించడం అద్భుతంగా ఉంటుంది.

శ్రీ రామచంద్రుడు, సీతాదేవి, శ్రీ భరత, లక్ష్మణ, శత్రుఘ్నులు మకర తోరణం కింద ఇరుపక్కలా శ్రీ హనుమంతుడు, శ్రీ గరుత్మంతుడు దర్శనమివ్వడం ఒక పావనమైన దర్శన అనుభూతిని భక్తులకు ప్రసాదిస్తుంది.

మూలవిరాట్టు పక్కనే ఉత్సవమూర్తులు కూడా దర్శనమిస్తారు. నిత్య పూజలు జరిగే ఈ ఆలయంలో పర్వదినాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. హనుమజ్జయంతి, శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా చేస్తారు.

దీనావస్థలో ఉన్న ఆలయాన్ని పునరుద్ధరించాలన్న సంకల్పంతో దేశ విదేశాలలో స్థిరపడిన గ్రామస్థులు కలిసి ఒక కమిటీగా ఏర్పడి ప్రణాళిక రచించినట్లు సమాచారం. గ్రామంలోని శివాలయం కూడా శిథిలమైంది. హరి హరుల ఆలయాలను ఒకే ప్రాంగణంలో రమ్యమైన ధామాలు నిర్మించి ప్రతిష్ఠించాలని నిర్ణయం జరిగినట్లు తెలుస్తోంది. శ్రీ పట్టాభిరాముని కృపాకటాక్షాలతో అనుకున్న విధంగా ఈ ఆలయం ఒక గొప్ప క్షేత్రంగా రూపుదిద్దుకోవాలని కోరుకుందాం.

# అతి భారీ ఆకులు

షేక్ అబ్దుల్ హకీం జాని

విస్తరాకులు మనకు పరిచయమే. బాదాంచెట్టు ఆకులను విస్తరిలా కలిపి కుట్టి భోజనాలు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రకృతి వింత కాకపోతే చిన్న చిన్న మొక్కలకు పెద్ద పెద్ద ఆకులు ఉంటే, చింత చెట్టు లాంటి భారీ వృక్షాలకు అతి చిన్న ఆకులు ఉంటాయి. తెలుగు వారికి అందుబాటులో ఉండే అతి పెద్ద ఆకు అరిటాకు. అరటి చెట్టు ఆకులైతే మన చేయి దాచినా అందనంత పెద్దగా ఉంటాయి. అరటి ఆకులో భోజనం చేస్తే చాలా ఆరోగ్యం అని పెద్దలు చెబుతుంటారు. వీటి సంగతి పక్కన పెడితే 80 కిలోల బరువును మోయగల అతి పెద్ద లిల్లీ ఆకులు అందరినీ సంభ్రమాశ్చర్యాలలో ముంచెతుతున్నాయి.

## భారీ ఆకులు

ఈ భారీ ఆకులు విక్టోరియా అమెజోనికా అనే జాతికి చెందినవి. ఈ భారీ నీటి లిల్లీ ఆకులు దక్షిణ అమెరికాలోని అమెజా నదీ పరివాహక ప్రాంతంలో ముఖ్యంగా బ్రెజిల్, గయానా, పెరూలోని నిస్సారమైన సరస్సులు, నదీ ప్రాంతాలలో సహజంగా కనిపిస్తాయి. ఈ ఆకులు 23 మీటర్ల వ్యాసం వరకు పెరుగుతాయి. బలమైన నిర్మాణం కారణంగా 80 కిలోల వరకు బరువును మోయగలవు. ఈ ఆకులను చూసి వింత అనుభూతిని పొందేందుకు ప్రపంచ పర్యాటకులు విధిగా వీటిని పెంచి పోషిస్తున్న ఉద్యానవనాలను సందర్శించి, నీటిపై తేలియాడే అతి పెద్ద ఆకులపై కూర్చుని అలౌకిక ఆనందాన్ని పొందుతుంటారు.

## చరిత్ర

విక్టోరియా అమెజోనికాను మొదట 1801లో దక్షిణ అమెరికాలోని అమెజాన్ నది బేసిన్లో గుర్తించారు. దీనిని కనుగొన్నవారు జర్మన్ శాస్త్రవేత్తలు హైమ్, బోన్ ప్లాండ్. దీనికి 1837లో బ్రిటిష్ బొటానిస్ట్ జాన్ లిండ్లీ విక్టోరియా అమెజోనికా అని నామకరణం చేశారు. బ్రిటన్ రాణి విక్టోరియా గౌరవార్థం ఈ పేరు పెట్టారు. 19వ శతాబ్దంలో యూరప్‌లో ఈ మొక్కను హాట్‌హౌస్లలో (గ్రీన్‌హౌస్లలో) పెంచడంతో ఇది బాగా ప్రసిద్ధి చెందింది. 1851లో లండన్‌లోని క్రిస్టల్ ప్యాలెస్‌లో ఈ ఆకులను ప్రదర్శించారు.



## ఆకుల లక్షణాలు

విక్టోరియా అమెజోనికా ఆకులు 2.5 నుండి 3 మీటర్ల వ్యాసం వరకు పెరుగుతాయి. దీనికి కారణం ఆకు కింది భాగంలో ఉండే గాలితో నిండిన గొట్టాల వంటి నిర్మాణం. ఈ ఆకులు గుండ్రంగా ఉండి, తేలియాడే సామర్థ్యాన్నితో పాటు దృఢంగా ఉంటాయి. ఆకు గుండ్రంగా ఉండి, అంచులు పైకి ఎత్తబడి ఉంటాయి. 19వ శతాబ్దంలో ఈ ఆకుల బలాన్ని ప్రదర్శించడానికి శాస్త్రవేత్తలు, బొటానిస్టులు వీటిపై పిల్లలను నిలబెట్టి ఫొటోలు తీసారు. 1860లలో బ్రిటన్‌లో ఒక ఏడేళ్ల బాలికను ఈ ఆకుపై నిలబెట్టి దాని సామర్థ్యాన్ని నిరూపించారు. ఈ ఆకుల బలం ఆధునిక ఇంజనీరింగ్‌కు కూడా స్ఫూర్తినిచ్చింది. జోసెఫ్ పాక్స్టన్, క్రిస్టల్ ప్యాలెస్ డిజైనర్ ఈ ఆకుల నిర్మాణం నుండి ప్రేరణ పొంది తన నిర్మాణాలలో బలమైన, తేలికైన ఫ్రేమ్ వర్లను రూపొందించారు.

నీటిలో పెరిగే ఈ వాటర్ లిల్లీ మొక్క ఆకులు పెద్దగానే విస్తరిస్తాయి. ఇటీవల కొన్ని ప్రాంతాల వారు వాటర్ లిల్లీ ఆకుల్లో కూడా భోజనాలు చేస్తున్నారు. తామర మొక్కల తరహాలో నీటిలో పెరిగే వాటర్ లిల్లీ ఆకులు గుండ్రంగా చాలా పెద్ద పరిమాణంలో ఉంటాయి. అలాంటిది వాటర్ లిల్లీలో కూడా చాలా పెద్ద రకాన్ని బ్రిటిష్ రాయల్ బొటానికల్ గార్డెన్స్ శాస్త్రవేత్తలు తాజాగా దక్షిణ అమెరికా దేశం బొలీవియాలో గుర్తించారు. మన పల్లెల్లోని చెరువుల్లో కలువ, తామర ఆకులను చూస్తూనే ఉంటాము. ఇవి కూడా సాధారణ ఆకు కంటే పెద్ద పరిమాణంలో ఉంటాయి. కొన్ని మొక్కల ఆకులు చిన్నవిగా ఉంటే మరికొన్ని మొక్కల ఆకులు భారీ పరిణామంలో ఉంటాయి. ఇదే రీతిలో కొన్ని దేశాలలోని ఉద్యానవనాల్లోని కొలనుల్లో అతి పెద్ద కలువ, తామర ఆకులు కనువిందు చేస్తున్నాయి. దక్షిణ అమెరికా దేశం బొలీవియాలో అతి పెద్ద ఆకులున్న కొలనును బ్రిటిష్ రాయల్ బొటానికల్ గార్డెన్స్, లండన్ శాస్త్రవేత్తలు సంయుక్తంగా కనుగొన్నారు. దీన్ని అక్కడ వాటర్ లిల్లీ మొక్క అని పిలుస్తారు. ఇన్నేళ్ల తర్వాత బొలీవియాలోని రిస్ కొనాడా గార్డెన్స్‌లో పెరుగుతున్న భారీ వాటర్ లిల్లీని గుర్తించారు. దాని ఆకులు ఏకంగా మూడున్నర మీటర్లకు పైగా వ్యాసంతో ఉండటం చూసి ఆశ్చర్యపోయారు. అంటే ఒక చిన్న సైజు గది అంత పెద్ద పరిమాణంలో ఈ ఆకులు ఉన్నాయి.

ప్రపంచంలో ఉన్న మిగతా రెండు నాటర్ లిల్లీ జాతులకు, దీనికి సంబంధం లేదని ఇది మొదటి నుంచీ వేరుగా పెరుగుతున్న మరో జాతి వాటర్ లిల్లీ అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇటీవలే ఫ్రాంటియర్స్ ఇన్‌ప్లాంట్ సైన్సెస్ జర్నల్‌లో ఈ పరిశోధన వివరాలు ప్రచురితమయ్యాయి. ఇది ఇతర రెండు వాటర్ లిల్లీల కంటే చాలా తక్కువ ప్రదేశాల్లో కనిపిస్తుంది. బ్రెజిల్‌లోని అమెజాన్ అడవులను నరికివేయడం వల్ల ఈ మూడు జాతులు అంతరించిపోయే ప్రమాదంలో పడ్డాయి. అమెజోనియన్ వాటర్ లిల్లీస్, అతున్ సిసాక్ (గ్రేట్ ఫ్లవర్), ఉపే జకానా అని కూడా పిలుచుకునే విక్టోరియా జెయింట్ వాటర్ లిల్లీస్‌లోని మూడు జాతులూ అందరినీ విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

విక్టోరియా బొలివియానా మంచినీటిలో వికసిస్తుంది. ఇది బొలీవియాలోని ఈశాన్య ప్రాంతంలో కనిపిస్తుంది. శాస్త్రవేత్తలు ఇప్పటికీ దాని కోసం శోధిస్తున్నారు. ఈ లిల్లీ పెద్ద ఆకుల వలే ఇతర చెట్ల కంటే సూర్యరశ్మిని సులభంగా పొందుతుందని పరిశోధకులు భావిస్తున్నారు. ఈ జాతి లిల్లీ చాలా త్వరగా పెరుగుతాయి. ముఖ్యంగా భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన ప్రదేశంలో ఈ వాటర్ లిల్లీ ఎక్కువగా పెరుగుతాయి. మిగిలిన మొక్కలకంటే ఎక్కువగా ఎదుగుతాయి. 2016లో బొలీవియాలోని శాంటా క్రూజ్ లేదా సియెర్రా బొటానిక్ గార్డెన్స్, లా రింకోనాడా గార్డెన్స్, క్యూ గార్డెన్స్లో ఈ నీటి కలువ విత్తనాలను పెట్టారు. ఉద్యానవన శాస్త్రవేత్త కార్లోస్ మాగ్దలీనా ఈ విత్తనాలను విత్తారు. అవి పెరిగిన తర్వాత లిల్లీలను చూసి కార్లోస్ ఆశ్చర్యానికి గురయ్యారు. ఇవి ఇతర లిల్లీలతో పోల్చితే భిన్నంగా ఉన్నట్లు గుర్తించారు. తామర మొక్కల తరహాలో నీటిలో పెరిగే వాటర్ లిల్లీ ఆకులు గుండ్రంగా చాలా పెద్ద పరిమాణంలో ఉంటాయి. అలాంటిది వాటర్ లిల్లీలో కూడా చాలా పెద్ద రకాన్ని నిజానికి 19వ శతాబ్దంలో యూరోపియన్ వృక్ష శాస్త్రవేత్తలు అతిపెద్ద ఆకులతో కూడిన వాటర్ లిల్లీ మొక్కలను గుర్తించారు. వాటికి అప్పటి బ్రిటిష్ రాణి పేరిట విక్టోరియా జాతికి చెందిన మొక్కలుగా ఈ కొత్త జాతి లిల్లీకి ఖివిక్టోరియా బొలీవియానాఖి అని పేరు పెట్టారు. ఇది నీటి కలువ మూడో జాతిగా గుర్తించారు. వాటి ఒక్కో ఆకు పెద్ద సైజు టేబుల్ అంత ఉంటుంది. ప్రపంచంలో అలాంటివి కేవలం అమెజాన్ ప్రాంతంలో ఒకచోట, బ్రిటన్లో మరోచోట మాత్రమే ఉన్నాయి. చిన్న పిల్లలు వాటిపై కూర్చున్నా కూడా అలాగే నీటిపై తేలుతూ ఉండగలిగేంత బలంగా వీటి ఆకులు ఉంటాయి. నేడు చైనాతో పాటు మరికొన్ని దేశాలలో వాటర్ లిల్లీ అతి పెద్ద ఆకులు కనిపిస్తున్నాయి. ఇవి దాదాపు 80 కేజీల బరువును మోయగలవు. వీటిపై యువతులు కూర్చుని, నిలబడి అనేక భంగిమల్లో ఛాయాచిత్రాలు తీయించుకుని మురిసిపోతుంటారు.

నైరుతీ చైనాలోని యునాన్ ప్రావిన్స్లోని చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో జిషువాంగ్బాన్నా ట్రాపికల్ బొటానికల్ గార్డెన్లో జెయింట్ వాటర్ లిల్లీ మొక్కలు ఉన్నాయి. వీటిని ఇక్కడ కింగ్ లోటస్, విక్టోరియా అమెజోనికా అని పిలుస్తారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆకులుగా పిలుస్తున్న వీటిపై యువతులు నిలబడి ఫోటోలు తీసుకుంటుంటారు. ఇవి దాదాపు 80 కిలోల బరువును మోయగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఇక్కడ 1963లో దక్షిణ అమెరికాలోని ఉష్ణమండల ప్రాంతాల నుండి కింగ్ లోటస్ విత్తనాలను తెప్పించి నాటారు. జూన్ నుండి అక్టోబర్ వరకు జిషువాంగ్ బాన్నా ట్రాపికల్ బొటానికల్ గార్డెను తిలకించడానికి ఉత్తమ సమయం.

వియత్నాంలో అతిపెద్ద వాటర్



లిల్లీలు కనిపిస్తాయి. ఇవి అక్కడి సరస్సుల్లో సహజసిద్ధంగా పెరుగుతాయి. కొందరు ఉద్యాన వనాలు, పార్కులు, తోటల్లో ఉన్న సరస్సుల్లో కూడా వీటిని పెంచుతారు. నీటి పైభాగాన భారీ ఆకులు తేలుతూ పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తాయి. ఈ ఆకులపై తేలికపాటి మందం కలిగిన వస్త్రాన్ని వేసి దానిపై యువతులు కూర్చుని ఫోటోలు తీయించుకుంటారు. ఈ వాటర్ లిల్లీ కాండాలు, పూవ్వులను వియత్నాం వారు వంటల్లో ఉపయోగిస్తారు. కొన్ని సందర్భాలలో మందుల తయారీలో సైతం ఉపయోగిస్తారు.

ఆంధ్రప్రదేశ్లోని కడప జిల్లాలోని యోగి వేమన విశ్వవిద్యాలయం బొటానికల్ గార్డెన్లో అయిదేళ్ల క్రితం జెయింట్ వాటర్ లిల్లీ మొక్కలు యేపుగా పెరిగి దీని ఆకు 2.5 మీటర్ల వెడల్పును కలిగి దాదాపు 40 కిలోల బరువును మోసింది. దీని గురించి అప్పట్లో వింతగా చెప్పుకున్నారు. అమెజాన్ అడవులో యేపుగా పెరిగే ఈ మొక్కను విశ్వవిద్యాలయంలోని బొటానికల్ గార్డెన్ నిర్వాహకులు డాక్టర్ ఎ.మధుసూదనరెడ్డి 2019లో కోల్కతా బొటానికల్ గార్డెన్ నుంచి తీసుకుని వచ్చి సంరక్షించగా వంద మొక్కల వరకు పెరిగాయి. ఈ మొక్క పేరు విక్టోరియా అమెజానికా. ఆంగ్లేయులు కోల్కతా బొటానికల్ గార్డెన్ను అభివృద్ధి పరిచే క్రమంలో ఈ జెయింట్ వాటర్ లిల్లీ మొక్కలను తెప్పించి అభివృద్ధి పరిచే కార్యక్రమాన్ని ప్రారంభించారు. విక్టోరియా కృజియానా అనే శాస్త్రీయ నామం కలిగిన ఈ మొక్క 1800 సంవత్సరంలో మన దేశానికి వచ్చింది. యోగి వేమన విశ్వవిద్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొలనులో జెయింట్ వాటర్ లిల్లీ మొక్కలను నాటారు. అప్పట్లో నాటిన మూడు మొక్కల్లో ఒకటి చనిపోగా రెండు మొక్కలు బతికి అందరికీ కనువిందు. చేశాయి. నీటిలో పెరిగే అతి పెద్ద మొక్కగా దీనికి పేరుంది. రెండు మొక్కలతో రెండు వందల మొక్కల వరకు పెంచి అనేక ప్రాంతాల బొటానికల్ గార్డెన్స్కు వీటిని సంపారు. 32 నుండి 38 డిగ్రీల ఉష్ణోగ్రతలో మాత్రమే ఇవి బతుకుతాయి.



నీటి అడుగు భాగం నుండి పెరిగే ఈ మొక్కల రెమ్మల నుండి విశాలమైన ఆకులు పెరుగుతాయి. ఒక్కో మొక్కకు 20 వరకు ఆకులు ఉంటాయి. 2 నుండి 5 మీటర్ల వెడల్పుతో పెరిగే జెయింట్ వాటర్ లిల్లీ ఆకుల అడుగు భాగం ముళ్లతో దృఢంగా ఉంటుంది. దీని పూలు పగటిపూట శ్వేత వర్ణంలో ఉంటే, సాయంత్రానికి గులాబీ వర్ణానికి మారి కీటకాలను ఆకర్షిస్తాయి. సువాసనలను వెదజల్లుతూ ఈ గులాబీ పూలు తేనెటీగలు, తూనీగలు మొదలైన కీటకాలను ఆకర్షిస్తాయి. ఈ భారీ ఆకులు ప్రపంచంలో ఎక్కడ పెరిగినా పర్యాటకుల్ని సైతం ఆకర్షించడం మరో విశేషం.

## మే - 18, 2025 నుండి మే - 24, 2025 వరకు



# వారఫలం


శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు, గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1

ఫోన్ : 98494 53449, 9440927795


### మేషం

ఈ వారం ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు అవసరం. దుష్ప్రచారాలను పట్టించుకోకుండా మీ పనిమీరు చేసుకుపోవడం వల్ల సానుకూల ఫలితాలను సాధిస్తారు. పోటీపరీక్షలలో విజయం సాధిస్తారు. నిత్యం సుబ్రహ్మణ్య పశుపతి కంకణం రూపు ధరించటం వలన మేలు జరుగుతుంది. వృత్తి ఉద్యోగాల పరంగా ఏర్పడిన ఇబ్బందులు సమస్యలు తీరిపోతాయి.

### వృషభం

ఈ వారం సంతాన పురోగతి బాగుంటుంది. బ్యాంకు రుణాలు తీసుకుంటారు. నానారకాల అరిష్టాలు, ఇబ్బందులు, శత్రుబాధలు, బాధలు నశించడానికి త్రిశూల్ ఉపయోగించండి. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. మీకు ఏ మాత్రం సంబంధం లేని వివాదాలకు మీరే బాధ్యత వహించాల్సి వస్తుంది. వృత్తి ఉద్యోగాలపరంగా పోటీ ఏర్పడుతుంది.

### మిథునం

ఈ వారం ప్రతివిషయంలోనూ ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల అండదండలు మీకు లభిస్తాయి. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. మానసికమైన ప్రశాంతత ఏర్పడుతుంది. నిత్యం నల్లవత్తులతో అష్టమూలికాతైలం కలిపి దీపారాధన చేయటం వలన శనీశ్వరుని అనుగ్రహం కలుగుతుంది. ఎవరినీ నొప్పించకుండా అందరికీ న్యాయం చేస్తారు.

### కర్కాటకం

ఈ వారం సంతానం నూతన ఉద్యోగావకాశాలు పొందుతారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుని కష్టసుఖాలను పంచుకుంటారు. నిత్యం సర్వరక్షాచూర్ణముతో స్నానమాచరించండి. ఉద్యోగాలలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా ఉండండి. అవసరాలకు డబ్బు అందుతుంది.

### సింహం

ఈ వారం పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. మహాతీర్థం పొడిలో చేసే అభిషేకాలు, పూజలు మంచి ఫలితాలను ఇస్తాయి. ఇష్టదేవతానుగ్రహం కలుగుతుంది. అభివృద్ధి కార్యక్రమాలకు గాను ఋణాలు మంజూరు అవుతాయి, మొండి సమస్యలు తీరిపోతాయి. వ్యాపారంలో రొటేషన్ సంతృప్తికరంగానే ఉంటుంది,

### కన్య

ఈ వారం వ్యాపార సంబంధమైన విదేశీయాన యత్నాలు అనుకూలిస్తాయి. ఐశ్వర్యనాగిని ఉపయోగించడం వలన లక్ష్మీకటాక్షం కలుగుతుంది. సంతానం అభివృద్ధి చెందడం, వాళ్ళ వలన పేరు ప్రతిష్ఠలు రావడం సంతోషం కలుగుతుంది. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. మీరు చేస్తున్న అన్ని విషయాలను గోప్యంగా ఉంచుతారు. రావలసిన బాకీలు కొద్ది కొద్దిగా జమ చేసుకుంటారు.

### తుల

ఈ వారం అసలు గురించే మీ ఆందోళన, వడ్డీల మీద ఆశపెట్టుకోరు. అరటినారవత్తులు, అష్టమూలికాతైలంతో దీపారాధన చేయటం అన్ని విధాలా మంచిది. చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేస్తారు. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. కోర్టు తీర్పులు మీకు అనుకూలంగా వస్తాయి. గతం గుర్తుకు వస్తే ఇప్పుడు ఎంత బాగున్నామో అర్థం అవుతుంది. రాజకీయ, కళారంగాలలోని వారు సన్మానాలు, సత్కారాలు పొందుతారు.

### వృశ్చికం

ఈ వారం అనుకోని అవకాశాలు లాభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి. నిత్యం సర్వదోష నివారణ చూర్ణముతో సర్వరక్షా చూర్ణము కలిపి స్నానము చేయడం వలన గ్రహాల వలన కలుగు బాధలు తొలగుతాయి. ఆర్థిక పరిస్థితి అనుకూలంగా ఉంటుంది. దీర్ఘకాలికా రుణాలు కొంత వరకు తీరుస్తారు. ఉద్యోగంలో ఇంక్రిమెంట్లు పొందుతారు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

### ధనస్సు

ఈ వారం వృత్తి వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. ఋణాలు కొంతవరకు తీరుస్తారు. నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగ యత్నాలు ముమ్మరం చేస్తారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చాలా అవసరం. నిత్యం యజ్ఞభస్మాన్ని ధరించడం వలన యజ్ఞం చేసిన ఫలితం వస్తుంది. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఇంట్లో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. .

### మకరం

ఈ వారం కలియుగ ధర్మానికి ఇది పరాకాష్ఠ, వివాహం చేసుకోవడంతోనే అన్ని బంధాలు తెగిపోతాయా? స్వేచ్ఛ నశించి పోతుందా? జన్మనిచ్చిన వారికి, తోడబుట్టిన వారికి సహాయం చేయటం నేరం అవుతుందా ? మొదలైన ప్రశ్నలకు అంతరాత్మ మనస్సుకు సమాధానం చెప్పలేదు. సంతానం పురోగతి బాగున్నప్పటికీ వారిలో ఒకరి ప్రవర్తన ఇబ్బందికరంగా మారుతుంది, నిత్యం సర్వదోష నివారణ కంకణం ధరించండి.


### కుంభం

ఈ వారం శుభకార్యాల విషయంలో కఠినంగా, దృఢంగా వ్యవహరిస్తారు. నానారకాల అరిష్టాలు, ఇబ్బందులు, శత్రుబాధలు, బాధలు నశించటానికి త్రిశూల్ ఉపయోగించండి. నూతన అవకాశాలు చక్కగా ఉపయోగించుకుంటారు. మీ పాండిత్యం అందరిచేత ప్రశంశించబడుతుంది. వృత్తి ఉద్యోగాలలో పురోగతి ఉన్నా ఏదో అసంతృప్తి వెన్నాడుతుంది. విలువైన సమాచారాన్ని తెలుసుకుంటారు. చురుగ్గా వ్యవహరిస్తారు.


### మీనం

ఈ వారం ప్రతి పనిని క్రమపద్ధతిలో నిర్వహిస్తారు. విద్యార్థినీ విద్యార్థులు నిత్యం సరస్వతీ తిలకాన్ని నుదుట ధరించటం, మేధాదక్షిణామూర్తి రూపును మెడలో ధరించటం వలన మంచి ఫలితాలను పొందగలుగుతారు. ధనాన్ని కన్నా వ్యక్తిగత గౌరవానికి అధిక ప్రాముఖ్యత నిస్తారు. సంతాన విషయంలో మీరు ఆనందించే విధంగా శుభసమాచారాన్ని వింటారు.


ఈ వారం కా'ర్టూన్స్'



INDIA
PAK
PAKISTAN
INDIA

దొంగ చాటుగా దెబ్బతీయడం ట్రైనింగిచ్చారుగానీ.. భయ్యా ఇలా ఎదురుపడి యుద్ధం చేయడం నేర్పించలేదు కదా!?

యుద్ధం ముగిసే దాకా "కరోనా" రూల్స్ అన్నీ పాటించండి.. ఏ టెన్షనూ ఉండదు!!
- సైకియాట్రిస్ట్ & కౌన్సిలర్ -





యెమెన్ దేశంలో వున్న సాకోత్రా ద్వీపానికి సంబంధించిన చిత్రాలివి. అరుదైన, వింత మొక్కలు, వివిధ రకాల పక్షులకు నిలయం ఈ ద్వీపం. జీవ వైవిధ్యానికి పేరు గాంచిన ఈ ద్వీపం పర్యాటకులను ఆకర్షిస్తోందనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.







